# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

15 ANNIVERSARY

హైదరాబాద్
16-5-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 43

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




3లో

## స్వల్పంగా మెట్రో ఛార్జీల వడ్డన



2లో

## కంచెగచ్చిబౌలి భూముల్లో పర్యావరణం పునరుద్ధరించండి

యధాతథ స్థితి కొనసాగించకుంటే జైలుకెళ్లక తప్పదు

భూములపై మరోమారు విచారించిన సుప్రీం

విచారణ జూలై 18కి వాయిదా వేసిన ధర్మాసనం



2లో

## ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిలిపివేయాల్సిందే

అప్పుడే సింధూజలాల గురించి ఆలోచిస్తాం

విదేశాంగశాఖ మంత్రి జైశంకర్ స్పష్టీకరణ



# కాళేశ్వరంలో ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

కాళేశ్వరంలో వైభవంగా సరస్వతీ పుష్కరాలు

తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారిగా నిర్వహణ

పుణ్యస్నానాలు ఆచరిస్తున్న వేలాది భక్తులు

12 రోజుల పాటు ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు

సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఘాట్ ప్రారంభం

**కాళేశ్వరం,(క్రైమ్ మిర్రర్):** కాళేశ్వరం వద్ద సరస్వతీ పుష్కరాలు ప్రారంభమయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో సరస్వతి నది పుష్కరాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సరస్వతీ పుష్కరస్నానం ఆచరించారు.

మిగతా 2లో

# డేంజర్‌లో శ్రీశైలం డ్యామ్?



## ఎన్డీఎస్ఏ తీవ్ర ఆందోళన

దిగువున ఉన్న నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీలకు సైతం ముప్పు.

మూడు సంవత్సరాల క్రితం కృష్ణా బోర్డు ఏర్పాటు చేసిన రిజర్వాయర్ల నిర్వహణ కమిటీ (ఆర్ఎంసీ) శ్రీశైలం డ్యామ్‌కు మరమ్మతుల అవసరాన్ని, నిధుల కేటాయింపుపై నివేదిక ఇచ్చింది. ఎన్డీఎస్ఏ కూడా పలు సిఫార్సులు చేసింది. తాత్కాలిక మరమ్మతులకు టెట్రాపాడ్స్‌ను (ముంబయి సముద్రతీరం కోతకు గురికాకుండా ఏర్పాటు చేసే నిర్మాణాలు) వినియోగించాలని తెలంగాణ డ్యాం సేఫ్టీ కమిటీ సూచించింది.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** రెండు తెలుగు రాష్ట్రాలకు అత్యంత కీలకమైన శ్రీశైలం డ్యాం భద్రతపై ఎన్డీఎస్ఏ తీవ్ర అసంతృప్తి ఆందోళన వ్యక్తం చేసింది. ఇటీవలే డ్యాం ఎగువ, దిగువ ప్రాంతాల్ని పరిశీలించిన ఎన్డీఎస్ఏ శ్రీశైలం డ్యాం భద్రతపై కీలక వ్యాఖ్యలు చేసింది. శ్రీశైలం డ్యామ్ ప్లంజ్ పూల్ కాంక్రీట్ స్టీల్ సిలిండర్ డ్రమ్స్ దెబ్బతిన్నాయని.. అత్యవసరంగా శ్రీశైలం డ్యామ్ ప్లంజ్ పూల్ కాంక్రీట్ స్టీల్ మరమ్మతులు చేపట్టాలని ఏపీ ప్రభుత్వానికి అనిల్ జైన్ లేఖ రాశారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు శ్రీశైలం డ్యాంను పట్టించుకోలేదని.. గతంలో నిపుణుల నివేదికను వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మండిపడింది. ఎన్డీఎస్ఏ వెల్లడించిన అంశాలతో శ్రీశైలం డ్యాం భద్రతపై తెలుగు రాష్ట్రాల ప్రజలలో ఆందోళన వ్యక్తమవుతుంది.

- మిగతా 2వ పేజీలో

# రెడ్ బుక్‌ను వదిలేది లేదు




వైసిపి చేయని అనేక పనులు చేస్తున్నాం

జగన్ నిర్వాకం వల్లనే ట్రూ అప్ ఛార్జీల వసూలు

చంద్రబాబు చొరవతో పెద్ద కంపెనీల రాక

నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కారర్యకర్తలకు నారా లోకేశ్ పిలుపు

**అనంతపురం,(క్రైమ్ మిర్రర్):** రెడ్ బుక్ మరువను... కేడర్‌ను ఇబ్బంది పెట్టిన వారిని వదలనని అంటూ మంత్రి నారా లోకేష్ మరోసారి స్పష్టం చేశారు..ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేయలేనిది 11నెలలో చేసి చూపించాం అని లోకేష్ అన్నారు.. కరెంటు చార్జీలు పెంచమని చెప్పాం.

- మిగతా 2వ పేజీలో



2లో

## అతివల రామప్ప పర్యటనపైనా రాజకీయమా

కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్న బిఆర్ఎస్ నేతలు

సబితమ్మకు ఇప్పుడు తెలంగాణ గుర్తుకు వచ్చిందా

మండిపడ్డ మంత్రి సీతక్క

ములుగు,(క్రైమ్ మిర్రర్): మిస్ వరల్డ్ కంటేస్టెంట్ల ములుగు, రామప్ప దేవాలయ పర్యటనను వివాదాస్పదం చేస్తున్నారని బిఆర్ఎస్‌పై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

9లో

## పాక్ అణ్వాయుధాల గుట్టు తేల్చాలి

వాటి రక్షణపై అనుమానాలు ఉన్నాయి.. అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీస్వాధీనం చేసుకోవాలి

పాక్ కుట్రలను తిప్పికొట్టిన భారత దళాలకు సెల్యూట్.. కాశ్మీర్ పర్యటనలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

# ఈ అధికారం మీకెవరు ఇచ్చారు?

రాజ్యాంగంలో అలాంటి ప్రొవిజన్ ఉందా?

రాష్ట్రపతి,గవర్నర్లను ఎలా ఆదేశిస్తారు

తమిళనాడు గవర్నర్ కేసులో తీర్పుపై అభ్యంతరం

సుప్రీం తీర్పుపై ప్రశ్నలు సంధించిన రాష్ట్రపతి

రాజ్యాంగ ధర్మాసనం సమాధానం ఇస్తుందా అన్న ఉత్కంఠ



**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** తమిళనాడు గవర్నర్ విషయంలో తీర్పుసందర్భంగా రాష్ట్రపతిని కూడా ప్రశ్నించిన సుప్రీం ధర్మాసనం తీరుపై రాష్ట్రపతి ముర్ము ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అధికారం మీకెవరు ఇచ్చారో చెప్పాలని స్పష్టం చేశారు.

- మిగతా 2వ పేజీలో



# రెడ్ బుక్‌ను వదిలేది లేదు

జగన్ నిర్వాకం వల్లే ట్రూ అప్ చార్జీలు వేయాల్సి వస్తోంది. దీనిపై మనం మాట్లాడకపోతే దెబ్బతింటాం. 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ ఇచ్చాం. చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రానికి పెద్దఎత్తున కంపెనీలు వస్తున్నాయి. అనంతపురానికి రూ. 22వేల కోట్ల విలువైన భారీ సోలార్ విండ్ ప్రాజెక్టు వస్తోంది. విశాఖకు టీసీఎస్ డెవలప్ మెంట్ సెంటర్ వస్తోంది. రాబోయే ఐదేళ్లలో మనపిల్లలకు ఉద్యోగాలు వస్తాయన్నారు.. ప్రతి కార్యకర్త మన ప్రభుత్వం చేసింది చెప్పుకోవాలి, భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా 4వేల పెన్షన్ ఇవ్వడం లేదు. అవ్వతాతలకు అండగా నిలిచేందుకే పెన్షన్ పెంచాం, ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నాం. వాటిగురించి పార్టీ కార్యకర్తలంతా ప్రజల్లోకి వెళ్లి మాట్లాడాలని పిలుపునిచ్చారు.. గుంతకల్లు నియోజకవర్గం గుత్తి సమీపంలోని రామరాజుపల్లిలో ఉత్తమ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న లోకేష్.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నట్లే కసితో పనిచేయాలి. బాబు సూపర్ - 6, బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ-లో పార్టీ తరపున పలు హామీలు ఇచ్చాం. ఒక్కొక్కటిగా వాటిని అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటు-న్నాం. 11 నెలల ప్రజాప్రభుత్వంలో వృద్ధాప్య పెన్షన్ 4వేలకు, వికలాంగ పెన్షన్ 6వేలకు పెంచాం. రాష్ట్రవ్యాప్తంగా పేదల ఆకలితీర్చే అన్నక్యాంటీ-న్లు ప్రారంభించాం. ఉచిత గ్యాస్ పథకాన్ని అమలు చేస్తున్నాం. ఈ పథకంలో నిబంధనలు సడలించి లబ్ధిదారుల ఎకౌంట్ లో నేరుగా డబ్బులు చేయాలని నిర్ణయించాం. మత్స్యకారులకు ఆర్థికసాయం అందించాం, చేనేతలకు 200 యూనిట్ల విద్యుత్ ఇచ్చాం. రోడ్లపై గుంతలన్నీ పూడ్చుకుంటూ వస్తున్నాం. జూన్ మాసంలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలు ఇస్తాం. ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ముందుకెళ్తున్నాం అని తెలిపారు.. అయితే, మన ప్రభుత్వం స్కూళ్లు మూసివేస్తుందని వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు నారా లోకేష్.

# అతివల రామప్ప పర్యటనపైనా రాజకీయమా

(మొదటి పేజీ తరువాయి)

స్వార్థ రాజకీయాల కోసం ప్రతి అంశాన్నీ వక్రీకరించడం బిఆర్ఎస్‌కు పరిపాటిగా మారిందని అంటూ ఫైర్ అయ్యారు. ప్రతి చిన్న విషయానికి తెలంగాణ సెంటిమెంటును రుద్ది తెలంగాణ ప్రతిష్టను దిగజార్చవద్దని మంత్రి సీతక్క హెచ్చరించారు. ఈ సందర్భంగా నిన్న మిస్ వరల్డ్ కాంటెస్ట్ వరంగల్ వేయి స్తంభాల గుడి, రామప్ప గుడి వద్ద హెరిటేజ్ వాక్ పర్యటన ఏర్పాట్లు- చేసిన ఉన్నతాధికారులకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. హెరిటేజ్ వాక్ సక్సస్ కావడంతో బిఆర్ఎస్ నేతలు కళ్లలో నిప్పులు పోసుకున్నారని, కోడిగుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని సె-టైర్లు వేశారు. ఇవంకా ట్రంప్ వచ్చినప్పుడు తోక పట్టుకొని తిరిగిన నాయకుడు.. ఎలాంటి సంస్కృతి సంప్రదాయాలు పాటించారో అందరికీ తెలుసన్నారు. గుళ్లలోకి కాళ్ళు కడుక్కొని వెళ్ళడం గిరిజన సంప్రదాయం.. అదే అక్కడ పాటించారు. అందులో ఒక ఈవెంట్ మేనేజ్మెంట్ అమ్మాయి కాళ్ళకు నీళ్ళు పోసింది. దానిని పట్టు-కొని తెలంగాణ ప్రభుత్వం చేసిందని బద్నాం చేస్తున్నారని, నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రభుత్వం కాళ్ళు కడిగితే అందరి కాళ్ళు కడిగించాలి కదా..? దానిని ప్రభుత్వానికి అంటగట్టడం సిగ్గు అనిపించడం లేదా? కవితమ్మ కాళ్ళ దగ్గర కలెక్టర్‌ను కూర్చోబెట్టినప్పుడు.. కేసీఆర్ కలెక్టర్లతో కాళ్ళు మొక్కించుకోవడం మీ దురహంకారం కదా.. దానికి వ్యతిరేకంగానే కదా ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారు. తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హత మీకుందా..? అంటూ నిప్పులు చెరిగారు. ఈమధ్య సబితా ఇంద్ర రెడ్డి ములుగు మీద పచ్చి అబద్ధాలు చెబుతున్నారని, ఆమె మంత్రిగా ఉన్నప్పుడు ఏం మానవత్వం చూపిందో తెలుసని.. అబద్ధాలు కాకుండా వాస్తవాలు మాట్లాడితే బాగుంటు-ందని సూచించారు.

# కాళేశ్వరంలో ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం

గురువారం సాయంత్రం కాళేశ్వరం చేరుకున్న సిఎం రేవంత్.. సరస్వతీ పుష్కర ఘాట్ ను ప్రారంభించారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి పుష్కరస్నానం ఆచరించారు. ఆ తర్వాత సరస్వతీదేవి విగ్రహాన్ని సిఎం ఆవిష్కరించారు. అనంతరం నదీ మాతకు హారతి ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు- చేసిన 10 అడుగుల సరస్వతిదేవి విగ్రహాన్ని, భక్తుల వసతి కోసం నిర్మించిన 86 గదుల సముదాయాన్ని సీఎం ప్రారంభించారు. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు ఈ మహాక్రతువు జరగనుంది. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నదికి పుష్కరాలు మొదల య్యాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకే బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమవుతున్నా.. గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు. దీంతో గురువారం వేకువజామున 5.44 గంటలకు సరస్వతి ఘాట్ వద్ద శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. కాగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదులు కలిసి త్రివేణి సంగమంగా ప్రవహిస్తోంది. కాళేశ్వర క్షేత్రం వద్ద త్రివేణి సంగమ తీరంలో ఇవాళ్టి నుంచి ఈనెల 26వ తేదీ వరకు సుమారుగా 12 రోజుల పాటు- సరస్వతీ నది పుష్కరాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించి, భక్తులు సాంకేతికంగా పొందే సేవలను సైతం అందులో పొందుపరిచారు. సదరు పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు సుమారు 50 వేలకు పైగా భక్తులు వచ్చి పుష్కర స్నానం చేయడంతో పాటు- పిండప్రదానం, దంపతీ స్నానం, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వార్లను దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు- చేశారు.

# ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిలిపివేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** ఆపరేషన్ సిందూర్ తర్వాత, భారత్‌కు అంతర్జాతీయ సమాజం నుంచి మంచి మద్దతు లభిస్తుందని భారత విదేశాంగమంత్రి ఎస్ జై శంకర్ అన్నారు. పహల్గామ్ దాడి తర్వాత, భారతదేశం సింధు జల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ నిర్ణయంపై మాట్లాడుతూ పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని శాశ్వతంగా నిలిపివేసే వరకూ ఈ ఒప్పందం నిలిపివేయబడుతుందన్నారు. ఈ క్రమంలో కశ్మీర్‌పై చర్చించాల్సిన ఒకే ఒక అంశం ఉందన్నారు. అది పాకిస్థాన్ అక్రమంగా ఆక్రమించిన భారత భూభాగాన్ని ఖాళీ చేయడం. దీని గురించి చర్చకు మేము సిద్ధంగా ఉన్నామని జైశంకర్ మరోసారి స్పష్టం చేశారు.కశ్మీర్ సమస్యపై ఎస్.జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో మూడో దేశం జోక్యం అవసరం లేదని, ఇది భారత్-పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక అంశమని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం పాకిస్థాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినట్లు కేంద్రమంత్రి చెప్పారు. పాకిస్థాన్ సైన్యాన్ని కాకుండా,ఉగ్రవాద కేంద్రాలను లక్ష్యంగా చేసుకున్నామని ముందే హెచ్చరించినట్లు పేర్కొన్నారు. అయినప్పటికీ, పాకిస్థాన్ ఈ సలహాను పట్టించుకోలేదన్నారు. భారతదేశంపై చేసిన దాడికి మా సైన్యం గట్టి ప్రతీకారం తీర్చుకుందన్నారు.

# డేంజర్‌లో శ్రీశైలం డ్యామ్?



## దిగువన ప్రాజెక్టులకు కూడా ముప్పే.. !

(మొదటి పేజీ తరువాయి)

2009లో కృష్ణా నదికి వచ్చిన భారీ వరదలతో భారీ గొయ్యి(ప్లంజ్ పూల్) ఏర్పడగా.. ఏటా వచ్చే వరదలతో ఇది మరింత పెద్దదవుతోంది. బ్యారేజీ దిగువన 143 అడుగుల లోతు, 400మీటర్ల వెడల్పుతో గొయ్యి ఏర్పడింది. మరోసారి భారీ వరదలు వస్తే ఏమిటన్న భయం అధికారుల్లో సైతం వినిపిస్తుంది. శ్రీశైలం జలాశయం తెలంగాణ, ఏపీలకు జీవనాడి. వర్షాకాలంలో నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు, వేసవిలో నీళ్లు అడుగంటిన సమయంలో దాదాపు 130 టీఎంసీలు నిల్వ ఉంటాయి. విద్యుత్ సరఫరాలో ఈ ప్రాజెక్టు రెండు రాష్ట్రాలకూ కీలకమైనది. దీనిపై ఏపీ వైపు 770 మెగావాట్లు, తెలంగాణ వైపు 900 మెగావాట్ల జలవిద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి. శ్రీశైలం డ్యాం భద్రత ప్రశ్నార్థకమైతే డ్యాం..జల విద్యుత్ కేంద్రాలు..దిగువన నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీల పై కూడా ఆ ఎఫెక్టు ఉండనుంది.

**మూడు** సంవత్సరాల క్రితం కృష్ణా బోర్డు ఏర్పాటు చేసిన రిజర్వాయర్ల నిర్వహణ కమిటీ (ఆర్ఎంసీ) శ్రీశైలం డ్యామ్‌కు మరమ్మతుల అవసరాన్ని, నిధుల కేటాయింపుపై నివేదిక ఇచ్చింది. ఎన్డీఎస్ఏ కూడా పలు సిఫార్సులు చేసింది. తాత్కాలిక మరమ్మతులకు టెట్రాపాడ్స్‌ను (ముంబయి సముద్రతీరం కోతకు గురికాకుండా ఏర్పాటు చేసే నిర్మాణాలు) వినియోగించాలని తెలంగాణ డ్యాం సేఫ్టీ కమిటీ సూచించింది. మరోవైపు ఏపీ జలవనరులశాఖ పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్‌కు అధ్యయన బాధ్యతలు అప్పగించింది. ఇటీవల తెలంగాణ డ్యాం సేఫ్టీ కమిటీ ఛైర్మన్, నీటిపారుదలశాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ సైతం ఎన్డీఎస్ఏ, కృష్ణా బోర్డుల దృష్టికి ప్లంజ్ పూల్ సమస్యను వివరించారు. శ్రీశైలం డ్యాం దిగువన భారీ గొయ్యి ఉండటం క్షేమకరం కాదని..ఎన్డీఎస్ఏ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. తాత్కాలికంగా టెట్రాపాడ్స్‌తో గొయ్యి పూడ్చవచ్చని%% డ్యాం నిర్వహణ ఏపీ పరిధిలో ఉన్న నేపథ్యంలో వీలైనంత త్వరగా స్పందించాలి అని తెలంగాణ ఈఎన్సీ, జి.అనిల్‌కుమార్ కోరుతున్నారు.

**మరమ్మతులు అత్యవసరం... !**

కృష్ణా నదికి భారీ వరద.. అంటే 14 లక్షల క్యూసెక్కుల స్థాయిలో వచ్చినా దిగువకు నీటిని వదిలేలా శ్రీశైలం డ్యాంను డిజైన్ చేసి నిర్మించారు. 2009లో 25 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. అప్పుడు డ్యాం గేట్ల దిగువన స్పిల్‌వే సమీపంలో పెద్ద గొయ్యి ఏర్పడింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ ఈ గొయ్యిపై బాతిమెట్రిక్ సర్వే చేపట్టింది. 143 అడుగుల లోతు, 400 మీటర్ల వెడల్పుతో గొయ్యి పరిధి ఉన్నట్లు నివేదించింది. ఆనకట్ట పునాది కన్నా లోతులో ఈ గొయ్యి ఉన్నట్లు గుర్తించారు. శ్రీశైలం ఆనకట్ట దిగువన ఏర్పడిన ప్లంజ్‌పూల్ ముప్పును రాష్ట్ర డ్యాం సేఫ్టీ కమిటీ అంచనా వేసి ఎన్డీఎస్ఏకు నివేదించింది. ఆనకట్టకు ప్రమాదం ఏర్పడితే డ్యాం నుంచి 25లక్షలు క్యూసెక్కుల భారీ ప్రవాహం డ్యాం నుంచి ఒకేసారి దిగువకు విడుదలవుతుంది. దిగువన ఉన్న నాగార్జునసాగర్..పులిచింతల, ప్రకాశం బ్యారేజీల మనుగడ కూడా తీవ్ర ప్రమాదంలో పడుతుంది.

# ఈ అధికారం మీకెవరు ఇచ్చారు?

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు పలు ప్రశ్నలను సంధించారు. శాసనసభలో ఆమోదించిన బిల్లులను పరిశీలన పేరుతో గవర్నర్లు, రాష్ట్రపతి నెలల తరబడి జాప్యం చేస్తుండటంపై ఇటీవల సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న రాష్ట్రపతి, గవర్నర్లు గడువులోగా బిల్లులు ఆమోదించాల్సిందేనని ధర్మాసనం ఆదేశించింది. అయితే, తాజాగా అత్యున్నత న్యాయస్థానం నిర్ణయాన్ని భారత ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము తీవ్రంగా ఖండించారు. ఈ ఆదేశాలు రాజ్యాంగం ప్రకారం ఎలా చెల్లుబాటు అవుతాయని సుప్రీంను ప్రశ్నిస్తూ 14 ప్రశ్నలను సంధించారు. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు రాష్ట్ర బిల్లులపై రాష్ట్రపతి, గవర్నర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని తీర్పు వెలువరించింది. గడువులోగా ఆమోదించడమో, వెనక్కి తిప్పిపంపడమో ఏదొకటి చేయాలని స్పష్టం చేసింది. బిల్లులు ఆమోదించకపోతే ఎందుకనే కారణాలు కచ్చితంగా చెప్పాలని తెలిపింది. ఈ తీర్పు తర్వాత కూడా ఇలాగే చేస్తుంటే సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని, రాజ్యాంగ అధికరణం 142 ప్రకారం గవర్నర్ల నిష్క్రియాపరత్వాన్ని న్యాయ సమీక్ష చేసేందుకు సంపూర్ణ అధికారం సుప్రీంకోర్టుకు ఉందని జస్టిస్ జేబి పార్దివాలా, ఆర్ మహదేవన్ ధర్మాసనం వెల్లడించింది. అయితే, సుప్రీం ఇలా కాలపరిమితి విధించడంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేది లేనప్పుడు ఈ తీర్పు ఎలా ఇవ్వగలరని రాష్ట్రపతి ముర్ము అత్యున్నత న్యాయస్థానాన్ని ప్రశ్నించారు. జస్టిస్ జేబి పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్ ఇచ్చిన 415 పేజీల తీర్పును సమీక్షించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 143(1) కింద రాష్ట్రపతికి ఉన్న అరుదైన అధికారాలను ఉపయోగించి 14 ప్రశ్నలపై సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. నూతన సీజేఐగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాష్ట్రపతి ముర్ము ఈ తీర్పుపై స్పందించడం గమనార్హం. ఆర్టికల్ 200 కింద బిల్లును ప్రవేశపెట్టినప్పుడు గవర్నర్‌కు అందుబాటులో ఉన్న రాజ్యాంగ ఎంపికలు ఏమిటి? ఈ ఎంపికలను అమలు చేయడంలో గవర్నర్ మంత్రి మండలి సలహాకు కట్టుబడి ఉంటారా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ విచక్షణాధికారం వినియోగించడం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందా? ఆర్టికల్ 200 కింద గవర్నర్ చర్యలను న్యాయపరంగా పరిశీలించడానికి ఆర్టికల్ 361 పై సంపూర్ణ నిషేధాన్ని విధిస్తారా? రాజ్యాంగం ప్రకారం కాలపరిమితి లేకపోయినప్పటికీ ఆర్టికల్ 200 కింద గవర్నర్లు తమ అధికారాలను వినియోగించు కునేటప్పుడు కోర్టులు గడువులు విధించవచ్చా, విధానాలను సూచించవచ్చా? ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి విచక్షణాధికారం న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందా? ఆర్టికల్ 201 ప్రకారం రాష్ట్రపతి విచక్షణాధికారం వినియోగించడానికి కోర్టులు కాలపరిమితిని, విధానపరమైన అవసరాలను నిర్ణయించగలవా?

గవర్నర్ రిజర్వ్ చేసిన బిల్లులపై నిర్ణయం తీసుకునేటప్పుడు రాష్ట్రపతి ఆర్టికల్ 143 కింద సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరాలా? ఒక చట్టం అధికారికంగా అమల్లోకి రాకముందు గవర్నర్, రాష్ట్రపతి ఆర్టికల్ 200, 201 ప్రకారం తీసుకునే నిర్ణయాలు న్యాయబద్ధమైనవేనా? ఆర్టికల్ 142 ద్వారా రాష్ట్రపతి లేదా గవర్నర్ వినియోగించే రాజ్యాంగ అధికారాలను న్యాయవ్యవస్థ సవరించగలదా లేదా అధిగమించగలదా?

ఆర్టికల్ 200 కింద గవర్నర్ అనుమతి లేకుండా రాష్ట్ర చట్టం అమలులోకి వస్తుందా? సుప్రీంకోర్టులోని ఏదైనా బెంచ్ ముందుగా ఒక కేసుకు గణనీయమైన రాజ్యాంగ వివరణ అవసరమా అని నిర్ణయించి దానిని ఆర్టికల్ 145(3) ప్రకారం ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్‌కు నివేదించాలా? ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టు రాజ్యాంగ లేదా చట్టబద్ధమైన నిబంధనలకు విరుద్ధంగా ఆదేశాలు జారీ చేయడం సబబేనా? ఆర్టికల్ 131 కింద దావా వేయడం ద్వారా కాకుండా వేరే మార్గాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి సుప్రీంకోర్టును రాజ్యాంగం అనుమతిస్తుందా? అంటూ ప్రశ్నలు సంధించారు. కాగా, రాజ్యాంగం ప్రకారం కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలకు గల అధికారాల పరిమితిపై రాష్ట్రపతి ముర్ము సంధించిన ప్రశ్నలకు సర్వోన్నత న్యాయస్థానం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని ముర్ము ప్రశ్నించినట్లు సమాచారం. ఈ మేరకు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. రాజ్యాంగంలోని 143 ఆర్టికల్ కింద ఉన్న ప్రత్యేక అధికారాలను వినియోగించుకొని సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్రపతి పలు ప్రశ్నలు సంధించినట్లు- ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రశ్నలపై న్యాయస్థానం తమ అభిప్రాయాలను తెలియజేయాలని అడిగినట్లు తెలుస్తోంది.

# అఫ్జల్‌గంజ్‌లో అగ్నిప్రమాదం.. భవనంలో చెలరేగిన మంటలు

బేగంబజార్ (హైదరాబాద్): నగరంలోని అఫ్జల్‌గంజ్ సమీపంలోని మహారాజ్‌గంజ్‌లో అగ్నిప్రమాదం జరిగింది. గురువారం తెల్లవారుజామున మూడంతస్తుల భవనంలో మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సమీపంలోని దుకాణాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. ఈ భవనంలోని మొదటి రెండు అంతస్తులను ప్లాస్టిక్ డిస్పోజబుల్ గ్లాసులు, ప్లేట్లు, ఇతర సామగ్రిని నిల్వచేసే గోదాములుగా వినియోగిస్తున్నారు. మూడో అంతస్తులో ఓ కుటుంబం నివాసముంటోంది. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంలో షార్ట్‌సర్క్యూట్ జరగడంతో భవనంలో మంటలు చెలరేగాయి. గోదాముల్లో తేలికపాటి సామగ్రి ఉండటంతో సులువుగా పైకి వ్యాపించాయి. దీంతో మూడో అంతస్తులోని కుటుంబసభ్యులు కేకలు వేశారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, అగ్నిమాపక, డీఆర్ఎఫ్ బృందాలు ఐదు ఫైరింజన్లతో అక్కడికి చేరుకున్నారు. మూడో అంతస్తులో ఉన్న ఓ చిన్నారి సహా ఐదుగురిని క్రేన్ సాయంతో సురక్షితంగా కిందికి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంతో పరిసరాల్లో పొగ దట్టంగా అలముకుంది.





# కంచెగచ్చిబౌలి భూముల్లో పర్యావరణం పునరుద్ధరించండి

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్‌లోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా? అనేది స్పష్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. లాంగ్ వీకెండ్ చూసి ఎందుకు చర్యలు మొదలు పెట్టారని ధర్మాసనం మరోసారి ప్రశ్నించింది. నష్టాన్ని పూడ్చేందుకు తీసుకునే చర్యలను స్పష్టంగా చెప్పాలంది. కేంద్ర సాధికార సంస్థ దాఖలు చేసిన నివేదికపై కౌంటర్ దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది సమయం కోరారు. పర్యావరణానికి జరిగే నష్టాన్ని పూడ్చే చర్యలు చేపట్టకపోతే సీఎస్ సహా కార్యదర్శులు జైలుకు పోవాల్సి ఉంటుందని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా విజిల్ బ్లోయర్స్, విద్యార్థులపై కేసుల విషయాన్ని పలువురు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ కేసులు కొట్టివేయాలని అప్లికేషన్ దాఖలు చేసినట్లు- తెలపగా.. ఈ పిటిషన్‌తో కలిపి విచారించడం కుదరదని సీజేఐ స్పష్టం చేశారు. కావాలనుకుంటే వేరే పిటిషన్ దాఖలు చేసుకోవచ్చున్నారు. అనంతరం తదుపరి విచారణను జులై 23కి సుప్రీంకోర్టు వాయిదా

వేసింది. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సర్వోన్నత న్యాయస్థానం గురువారం విచారణ జరిపింది. హెచ్‌సీయూలో 120 ఎకరాల్లో చెట్ల కూల్చివేత విధ్వంసంపై సుప్రీం కోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని మే 15 వరకు పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా కోర్టు విచారణ జరిపింది. హెచ్‌సీయూలో విధ్వంసానికి సంబంధించిన వివరాలన్నింటిని పరిశీలించడానికి ఏప్రిల్ 10న సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ- హెచ్‌సీయూ విధ్వంసాన్ని పరిశీలించింది. అక్కడి విద్యార్థి సంఘాల నాయకుల అభిప్రాయాలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, రాజకీయ నాయకుల ఒపీనియన్స్ సైతం సేకరించింది. కాగా, అక్కడ జరిగింది విధ్వంసమే.. చెట్లు-, జంతువులకు తీవ్ర నష్టం వాటిల్లిందని నివేదికను ఏప్రిల్ 15న కమిటీ- సుప్రీం కోర్టుకు సమర్పించింది. అదే రోజు ప్రభుత్వం సైతం నివేదిక ఇవ్వాలని సుప్రీం కోర్టు కోరింది. ఇదే సమయంలో మే 15 వరకు మీరు హెచ్‌సీయూ అడవుల్లో కూల్చిన చెట్లను ఎలా పునరుద్ధరిస్తారో చెప్పాలని కోర్టు ప్రశ్నించింది. గతంలో విచారణ సమయంలోనూ తెలంగాణ ప్రభుత్వం సరైన నివేదిక ఇవ్వాలని.. అలా ఇవ్వకపోతే సీఎస్‌ను జైలుకు పంపాల్సి వస్తుందని హెచ్చరించిన విషయం విధితమే. చెట్లను నాటడానికి ఏ విధమైన పద్ధతులను అనుసరిస్తారో చెప్పాలంటూ సూచించింది. ఈ విషయంలో ప్రభుత్వం, సీఎస్‌ను ఎవరినీ కూడా ఉపేక్షించబోమని హెచ్చరించింది.

## హుస్నాబాద్,సిరిసిల్ల జిల్లాలో సైనిక్ స్కూల్

### రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చించా: బండి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సైనిక్ స్కూల్ వివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. హుస్నాబాద్,సిరిసిల్ల జిల్లాలో సైనిక్ స్కూల్ కోసం గత నెల 15న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ను కలిశానని వివరించారు. ఈ సంధ్బరంగా బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సైనిక్ స్కూల్ ఏర్పాటు- కోసం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారన్నారు. తన విజ్ఞప్తికి రాజ్‌నాథ్ సానుకూలంగా స్పందించడం సంతోషంగా ఉందన్నారు. దీనిపై రాజకీయం చేయడం తగదని బండి హెచ్చరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి సహకరించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వమైనా కలిసిరావాలని కోరుతున్నామన్నారు.

## నాంపల్లి వద్ద రౌడీషీటర్ దారుణ హత్య

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** నగరంలోని నాంపల్లిలో దారుణం చోటు-చేసుకుంది. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి వద్ద రౌడీషీటర్ హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే.. చాంద్రాయణగుట్టకు చెందిన అయాన్ ఖురేషీ ఓ కేసు నిమిత్తం నాంపల్లి కోర్టుకు వచ్చాడు. అనంతరం తిరిగి వెళ్తుండగా ఐదుగురు దుండగులు ఆయన్ను వెంబడించారు. క్యాన్సర్ ఆస్పత్రి వద్ద తొలుత బ్యాట్‌తో దాడి చేశారు. అనంతరం కత్తులతో గొంతు కోసి పొట్టలో పొడిచి చంపారు. హత్యకు ఉపయోగించిన బ్యాట్, కత్తులను ఘటనాస్థలంలోనే వదిలి పరారయ్యారు. సమాచారం అందుకున్న నాంపల్లి పోలీసులు.. ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన ఒక్కసారిగా కలకలం రేపింది. స్థానికులు బయాందోళనలకు గురయ్యారు.

## సౌదీలో తెలంగాణ వాసి అనుమానాస్పద మృతి

**సూర్యాపేట, (క్రైమ్ మిర్రర్):** సౌదీ అరేబియాలో కోదాడకు చెందిన వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. షేక్ తాజుద్దీన్ సౌదీలో పదేళ్లుగా కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 8న కాలిన గాయాలతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషయాన్ని సౌదీ పోలీసులు ఆలస్యంగా తాజుద్దీన్ కుటు-ంబసభ్యులకు తెలియజేశారు. సౌదీలో కపిల్ అనే వ్యక్తితో తాజుద్దీన్‌కు కొద్ది రోజులుగా గొడవలున్నాయని, అతడే కాల్చి చంపి ఉంటాడని కుటు-ంబసభ్యులు ఆరోపిస్తున్నారు.

# స్వల్పంగా మెట్రో ఛార్జీల వడ్డన




**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** మెట్రో రైలు ప్రయాణించే ప్రయాణికులకు ధరలవాత మొదలయ్యింది. ధరలను పెంచుతూ.. నిర్ణయం తీసుకున్నారు. మెట్రో రైలు ఛార్జీలు పెంచుతున్నట్లు- హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ గురువారం ప్రకటించింది. ఇకపై మెట్రో రైలు టికెట్ ధర కనిష్టంగా రూ.12 కాగా.. గరిష్టంగా రూ.75గా పెరగనుంది. ప్రస్తుతం మెట్రో రైలులో టికెట్ కనిష్ట ధర రూ. 10.. గరిష్టంగా రూ.60గా ఉంది. ఈ పెంచిన ధరలు మే 17వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించింది. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సులువుగా ప్రయాణికులను ఈ మెట్రో రైలు గమ్యస్థానాలకు చేరుస్తుంది. అటు ఎల్ బీ నగర్ నుంచి ఇటు మియాపూర్ వరకు.. అలాగే ఇటు నాగోలు నుంచి అటు రాయదుర్గం వరకు ప్రయాణించే ఈ మెట్రో రైలు నగరవాసులను అతి కొద్ది కాలంలోనే ఆకట్టు-కుంది. ప్రతి రోజు ఈ రైళ్లలో లక్షలాది మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. నగరంలో భారీ వర్షం పడినప్పుడు.. ప్రయాణికులు ఈ మెట్రో రైళ్లను ఆశ్రయిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే విశ్వ నగరం వేదికగా క్రికెట్ మ్యాచ్‌లు జరిగినప్పుడు.. మెట్రో ప్రత్యేక సర్వీసులను సైతం నడుపుతోంది. అయితే మెట్రో నష్టాల్లో నడుస్తున్న నేపథ్యంలో ఛార్జీల పెంపు ప్రతిపాదన గతంలోనే వచ్చింది. దీనిపై అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

**హైదరాబాద్ మెట్రో రైలులో ఛార్జీల పెంపు**

ఈ నెల 17వ తేదీ నుంచి కొత్త ధరలు అమలు

**కనీస టికెట్ ధర రూ.10 నుంచి రూ.12కి పెంపు**

గరిష్ఠ టికెట్ ధర రూ.60 నుంచి రూ.75కి పెంపు

**వివిధ దూరాలకు అనుగుణంగా ఛార్జీల సవరణ**

- రెండు స్టేషన్ల వరకు ప్రయాణానికి కనీస ఛార్జీ రూ.12.
- 2 నుంచి 4 స్టేషన్ల మధ్య ప్రయాణిస్తే రూ.18.
- 4 నుంచి 6 స్టేషన్ల వరకు రూ.30.
- 6 నుంచి 9 స్టేషన్ల వరకు ప్రయాణానికి రూ.40.
- 9 నుంచి 12 స్టేషన్ల వరకు రూ.50.
- 12 నుంచి 15 స్టేషన్ల వరకు రూ.55.
- 15 నుంచి 18 స్టేషన్ల వరకు ప్రయాణిస్తే రూ.60.
- 18 నుంచి 21 స్టేషన్ల వరకు రూ.66.
- 21 నుంచి 24 స్టేషన్ల వరకు రూ.70.
- 24 స్టేషన్లు లేదా అంతకంటే ఎక్కువ దూరం ప్రయాణించినట్లయితే రూ.75 చెల్లించాల్సి ఉంటుంది.

# 8వేల కోట్ల ఫీజు బకాయిలు

## తక్షణమే చెల్లించి ఆదుకోండి.. సిఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తక్షణమే ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రూ.8వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు-కళాశాలలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడ్డాయి. కొన్ని కాలేజీలు ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వట్లేదు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీలను ప్రభుత్వమే విస్మరించిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కారణంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ. 8,000 కోట్ల ఫీజు బకాయిలు పేరుకుపోయాయని ఆయన లేఖలో పేర్కొన్నారు. బండి సంజయ్ పేర్కొన్న వివరాల ప్రకారం, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అధ్యాపకులకు జీతాలు, సిబ్బందికి భత్యాలు, కాలేజీల నిర్వహణ ఖర్చులు కూడా భరించలేని స్థితిలో ఉన్నాయని, అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు మూతపడటం ప్రారంభించాయని బండి సంజయ్ హెచ్చరించారు. విద్యార్థులకు ఫీజులు చెల్లించనిదే సర్టిఫికెట్లు- ఇవ్వడం లేదని, దీంతో విద్యార్థులు, కళాశాల యాజమాన్యాల మధ్య వాగ్వాదాలు తీవ్రమై పోలీస్ స్టేషన్ల దాకా కేసులు వెళ్లుతున్నాయని అన్నారు.అసెంబ్లీ సాక్షిగా ఫీజు బకాయిలను వన్ టైం సెటిల్ మెంట్ చేయాలని ఒకసారి, మరోసారి 12 వాయిదాల్లో చెల్లిస్తామని ముఖ్యమంత్రి మాట ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ మాటలను విస్మరించడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. ఈ విద్యా సంవత్సరం నుండే బకాయిలను నిర్ణీత వ్యవధిలో చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. బండి సంజయ్ ప్రభుత్వానికి హితవు పలుకుతూ, విద్యార్థుల భవిష్యత్తును, కళాశాలల మనుగడను దృష్టిలో పెట్టు-కుని తక్షణమే బకాయిల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యారంగంపై ప్రభుత్వం చూపుతున్న అలసత్వం లక్షలాది మంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మానసిక క్షోభ కలిగిస్తోందని తీవ్రంగా విమర్శించారు.

## యాదగిరిగుట్టను సందర్శించిన ప్రపంచ సుందరీమణులు



యాదగిరిగుట్ట, భువనగిరి: మిస్‌వరల్డ్ పోటీదారులు గురువారం సాయంత్రం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ గెస్ట్‌హౌస్ నుంచి బ్యాటరీ వాహనాల్లో చేరుకున్న సుందరీమణులు అఖండ దీపారాధన మండపంలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి వెంట ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుటుంబ సభ్యులు, జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలయ ఏఈవో భాస్కర్ తదితరులు ఉన్నారు. ఆక్టోపస్, తెలంగాణ స్పెషల్ పోలీస్, ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది భద్రతను పర్యవేక్షించారు.

**పోచంపల్లిలో అందాల భామలు**

టూరిజం విలేజ్‌గా గుర్తింపు తెచ్చుకున్న పోచంపల్లిని ఆఫ్రికా ఖండానికి చెందిన 25 దేశాల మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించారు. వారికి స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఇక్కత్ చీరల ప్రత్యేకత, తయారీ విధానాన్ని విదేశీ అతిథులు పరిశీలించారు. పలువురు భామలు స్వయంగా చీరలను నేసి సంబరపడ్డారు.

# ఇది తెలంగాణ ఆడబిడ్డలకు అత్యంత తీవ్రమైన అవమానం'



హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా హైదరాబాద్ కు వచ్చిన విదేశీ వనితలకు తెలంగాణ ఆడబిడ్డల చేత కాళ్లు కడిగించడాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. ఈ విషయంలో తెలంగాణ ఆత్మగౌరవాన్ని, మన ఆడబిడ్డల అభిమానాన్ని తాకట్టుపెట్టారంటూ ధ్వజమెత్తారు. తెలంగాణ ఆడపడుచులతో విదేశీ వనితల కాళ్లు కడిగిస్తారా? అంటూ ప్రశ్నించారు కిషన్‌రెడ్డి. ఈ మేరకు గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు కిషన్‌రెడ్డి. 'ప్రపంచదేశాల ముందు తెలంగాణ ఆత్మగౌరవాన్ని పెంచాల్సింది పోయి.. వారి ముందు మన ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టేట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటు. 72వ మిస్‌వరల్డ్ పోటీల్లో భాగంగా.. కల్చరల్, స్పిరిచువల్ టూర్‌లో పాల్గొనేందుకు.. యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ అయిన రామప్ప దేవాలయానికి ప్రపంచ అందగత్తెలు వచ్చిన సందర్భంలో.. విదేశీ వనితల కాళ్లను తెలంగాణ మహిళలతో, దళిత, గిరిజన యువతులతో కడిగించడం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అహంకారానికి నిదర్శనం. మహిళా సాధికారతకు, మహిళల ధైర్యసాహసాలకు ప్రతీక అయిన రాణి రుద్రమదేవి ఏలిన గడ్డపై, చారిత్రక రామప్ప ఆలయ ప్రాంగణంలో తెలంగాణ మహిళలను అవమానించడం దురదృష్టకరం.మ్మక్క, సారలమ్మ పుట్టిన గడ్డపై మహిళలకు అత్యంత తీవ్రమైన అవమానం జరిగింది. ఇది కాంగ్రెస్ పార్టీ సంస్కృతి. భారతీయులను విదేశీయుల ముందు మోకరిల్లేలా చేయడమే కాంగ్రెస్ పార్టీ చరిత్ర.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption

# ఎడిటోరియల్

4
శుక్రవారం
16-5-2025

## ఎడిటోరియల్



**అ**మెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంత సులభంగా అర్థం కారని ఆయన గల్ఫ్ దేశాల పర్యటన తీరుతెన్నులు చూస్తే తెలుస్తుంది. తాను అధికారంలోకొస్తే పశ్చిమాసియాలో సాగుతున్న 'అంతూ దరీ లేని యుద్ధాలకు' ముగింపు పలుకుతానని అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఆయన తరచు అనే వారు. ప్రస్తుతం కొనసాగుతున్న నాలుగు రోజుల గల్ఫ్ పర్యటనలో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు గమనిస్తే ఆ వాగ్దానాన్ని ఆయన నెరవేర్చదల్చుకున్నట్టు కనబడుతోంది.

తన రెండో దశ పాలనలో ట్రంప్ మొదలెట్టిన తొలి విస్తృత విదేశీ పర్యటన ఇది. ఈ ప్రాంతంలోనే ఉన్న ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లకపోవటం ఆయన తాజా వైఖరికి సంకేతం. ఇది ఎన్నాళ్లుంటుందన్నది తెలియక పోయినా చేస్తున్న ప్రకటనలైతే భిన్నంగా ఉన్నాయి. ఇరాన్‌తో అమెరికా 46 ఏళ్లుగా సాగిస్తున్న

# 'శాంతిదూత' ట్రంప్!

'అప్రకటిత యుద్ధం' ఇక కొనసాగనీయరాదన్న అభిప్రాయం ఉందని మంగళవారం సౌదీ అరే బియాలోని రియాద్‌లో ఆయన ప్రకటించారు. బుధవారం సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్%–% షారాతో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్‌తో మంచి సంబంధాలు నెలకొల్పుకొనాలని సలహా ఇచ్చారు.

అల్%–%షారాకు గతంలో అల్ కాయిదాతో, ఐఎస్‌తో సంబంధాలుండేవి. ఈ భేటీకి ముందే గల్ఫ్ సహకార మండలి(జీసీసీ) సదస్సులో సిరియాపై ఆంక్షలు ఎత్తేస్తున్నట్టు తెలియజేశారు. ఈ నిర్ణయాలపై ఇజ్రాయెల్ అలిగినా, మరొకరు అభ్యంతర పెట్టినా ఆయన ఖాతరు చేయదల్చుకున్నట్టు లేరు. గత నెలలో ట్రంప్‌ను కలిసి సిరియాపై ఆంక్షలు కొనసాగించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ వేడుకున్నారు. ఇరాన్ విషయంలో అయితే చాలా చెప్పివుంటారు. సిరియాపై ఆంక్షలు ఎత్తేయటం, ఇరాన్‌తో చెలిమికి సిద్ధపడటం నెతన్యాహూకు ససేమిరా ఇష్టం లేదు. కానీ లీకుల ద్వారా తప్ప నేరుగా తన అసమ్మతిని ఇంతవరకూ తెలియజేయలేదు. ఆ మధ్య ట్రంప్ ఇందుకు భిన్నంగా మాట్లాడారు. అణు ఒప్పందాన్ని అంగీకరించి, శాంతికి సిద్ధపడకపోతే ఇరాన్ భారీ స్థాయి ఒత్తిడులు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. కానీ ట్రంప్ తాజా ధోరణి అందుకు భిన్నంగా ఉంది.'ప్రస్తుతం అమెరికాకు అత్యంత సన్నిహిత దేశాలు కొన్ని తరాల కిందట మాపై శత్రుత్వంతో చెలరేగినవే' అని గుర్తుచేశారు. సిరియా, ఇరాన్‌ల విషయంలో తన వైఖరి మారటానికి సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ కారణమని ఆయన జీసీసీ వేదికపైనే ప్రకటించారు కూడా. యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదార్లు ఇజ్రాయెల్‌పై విరుచుకుపడుతూనే ఉన్నా ఈనెల 5న వారితో అవగాహనకొచ్చారు. స్నేహంలోనైనా, శత్రుత్వంలోనైనా ట్రంప్ తీరే వేరని ఆయన నిర్ణయాలు తెలియజేస్తున్నాయి. మూడేళ్లనాడు అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సౌదీ వచ్చినప్పుడు దేశంలో మానవహక్కులు అడుగంటుతున్న వైనంపై సౌదీ యువరాజును నేరుగా ప్రశ్నించారు. 2018లో జర్నలిస్టు జమాల్ ఖషోగ్గి ప్రాణం తీయించడాన్ని ప్రస్తావించారు. ఈ మాదిరి హత్యలు తమకు సమ్మతంకావని చెప్పారు. అందుకే కావొచ్చు... ఇప్పుడు ట్రంప్‌కు ఎదురైన స్వాగతసత్కారాల వంటివి బైడెన్‌కు లభించలేదు. సౌదీ గడ్డపై గతకాలపు అమెరికా అధ్యక్షుల్ని నిశితంగా విమర్శించటానికి ట్రంప్ వెన కాడలేదు. అమెరికన్ సమాజం గురించి కాస్తయినా తెలియనివారు ఎంతో జటిలమైన గల్ఫ్ సమా జాల్లో జోక్యం చేసుకోవటానికి ఎగబడ్డారని వ్యాఖ్యానించటం చిన్న విషయం కాదు. పశ్చిమాసియా దేశాలతో ఎన్ని వేల కోట్ల డాలర్ల ఒప్పందాలు కుదుర్చుకోగలమన్నదే ఆయన ఆరాటంగా కనబడు తోంది. దానికి తగ్గట్టే మంగళవారం సౌదీతో 14,200 కోట్ల డాలర్ల మేర ఆయుధ ఒప్పందంపై సంతకాలయ్యాయి. ఇదిగాక అమెరికాలో 60,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్టు యువరాజు ప్రకటించారు. ట్రంప్ దీంతో సంతృప్తిపడలేదు. దీన్ని లక్ష కోట్ల డాలర్లకు పెంచాలని ఆ వేదికపైనుంచే కోరారు. సౌదీతో అమెరికాకు ఎప్పుడూ మంచి స్నేహసంబంధాలేవున్నా ఈ స్థాయి ఒప్పందాలెప్పుడూ లేవు. ఒక పరిశోధక సంస్థ నివేదిక ప్రకారం 2010%–%20 మధ్య అమెరికాకు సౌదీతో 10,000 కోట్ల డాలర్ల విలువైన ఆయుధ ఒప్పందాలు మాత్రమే కుదిరాయి. స్నేహం పేరుతో అమెరికాను దోచుకుంటున్నారని నాటో భాగస్వామ్య దేశాలైన పాశ్చాత్య మిత్రులపై తరచూ విరుచుకుపడే ట్రంప్...పశ్చిమాసియా దేశాలకు ఏ కష్టమొచ్చినా అమెరికా దృఢంగా నిలబడుతుందని హామీ ఇవ్వటం గమనార్హం. ఇంధన అవసరాల్లోనూ, రక్షణరంగంలోనూ పనికొచ్చే అత్యంత విలువైన లిథియం, కోబాల్ట్‌లతోపాటు థోరియం వంటి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ అన్వేషించి అమెరికా చేర్చటానికి సౌదీ%–%అమెరికా ఖనిజ సంస్థల మధ్య ఈ పర్యటనలో 900 కోట్ల డాలర్ల ఒప్పందం కుదరటంతో ట్రంప్ సంతోషానికి పట్టపగ్గాల్లేవు.

# కాల్పుల విరమణతో మోడీ ఇమేజ్ పెరిగిందా..తగ్గిందా!

**పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ప్రధాని మోడీ రాజకీయ ఇమేజ్‌ను ప్రభావితం చేసిందా అన్న చర్చ దేశ ప్రజల మధ్య తీవ్రంగా సాగుతోంది. ఆపరేషన్ సిందూర్, బాలాకోట్ దాడులతో ఉగ్రవాద వ్యతిరేక యోధుడుగా ఇమేజ్‌ని సొంతం చేసుకున్న మోడీ ఇప్పుడు ఎందుకిలా చేశారు అనే ప్రశ్న అందరి మదిలో మెదులుతోంది. ఆపరేషన్ సిందూర్ తో పాకిస్తాన్ ఎంతగానో బెదిరిపోయింది.**

అది అనివార్యంగా చర్చలకు వచ్చేలా చేసింది. అయితే, యుద్ధ క్షేత్రంలో దాయది పై పూర్తిగా పై చేయి సాధించిన భారత్.. మరోమారు అది వికృత చేష్టలకు పాల్పడకుండా ఎలాంటి ఒప్పందాలు లేకుండానే కాల్పుల విరమణకు ఎందుకు ఒప్పుకుంది అనేది ప్రశ్న. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌ని భయపెట్టగలిగాము..కానీ అది ఎంత కాలం అనే ప్రశ్న అనివార్యంగా వస్తుంది. ఒకవైపు, కాల్పుల విరమణ.. మరోవైపు పాకిస్తాన్ ఎప్పటిలాగే ఎల్ఓసీ వద్ద తన కుక్కబుద్ధి ప్రదర్శన. అది మళ్లీ భారత్ వైపు కన్నెత్తి చూడకుండా చేసేందుకు అందివచ్చిన అవకాశాన్ని భారత్ ఎందుకు వదులుకుంది? ఏ ఒత్తిడులకు తలొగ్గి కాల్పుల విరమణకు ఒప్పుకుందో ప్రధాని మోడీ ప్రజలకు చెప్పాలంటూ ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయి. కాల్పుల విరమణ ఒప్పందం రాజకీయ రాజీగా విమర్శలు ఎదుర్కొంటోంది. అయితే ఈ నిర్ణయం మోడీ దీర్ఘకాల వ్యూహాత్మక దృష్టిని ప్రతిబింబిస్తుందని అధికార వర్గాలు అంటున్నాయి. కానీ దీనిని అర్థం చేసుకునే స్థితిలో ఇప్పుడు భారత ప్రజలు ఉన్నారా? విమర్శకులు కూడా ఈ నిర్ణయాన్ని మోడీ స్ట్రాంగ్ మ్యాన్ ఇమేజ్‌కు ఎదురుదెబ్బగా చూస్తున్నారు. పాకిస్తాన్ బలహీనత, అంతర్జాతీయ ఒత్తిడి ఈ ఒప్పందానికి దారితీశాయనేది బహిరంగ రహస్యం. ఏదేమైనా, ఆపరేషన్ సిందూర్ తో ప్రధాని మోడీ ఇమేజ్ ఒక్కసారిగా పైకెళ్లి, ఆ తర్వాత ఆయన భక్తులు కూడా ఉస్సూరుమనే పరిస్థితి ఏర్పడిందనేది కళ్లముందు కనిపిస్తున్న నిజం. వారే కాదు, రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, మేధావులు, రక్షణ రంగ నిపుణులు, కళాకారులు, జర్నలిస్టులు ఇలా ప్రతీ ఒక్కరూ తీవ్ర నిరాశకు లోనయ్యారు. దీంతో ఆత్మరక్షణలో పడిన ప్రధాని మోడీ డ్యామేజీ కంట్రోల్‌కు దిగినట్టు కనిపిస్తోంది. సోమవారం జాతినుద్దేశించి ప్రసంగించడం, ఆ మరుసటి రోజే పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించడం ఇందులో భాగమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 'కాల్పుల విరమణ'పై ఆగ్రహంతో ఉన్న వారిని తన ప్రసంగంతో దారికి తెచ్చుకోవాలని ప్రధాని మోడీ ఎంతో ప్రయత్నించారు. భావోద్వేగపూరిత సంభాషణలతో స్పీచ్‌ను కొనసాగించారు. అయితే, ప్రజలు, మేధావులు మోడీ నోటివెంట వినాలనుకొన్నది సెంటిమెంట్ స్పీచ్ కాదు. 'కాల్పుల విరమణ' నిర్ణయాన్ని ఎందుకు, ఏ పరిస్థితుల్లో అంగీకరించాల్సి వచ్చిందన్న దానిపైనే అందరి ఆసక్తి నెలకొంది. అయితే, తన ప్రసంగంలో ఆ విషయాన్నే మోడీ దాటవేశారు. 'ట్రంప్ వాణిజ్య బెదిరింపుల వ్యాఖ్యల'పై కూడా ఆయన స్పందించలేదు. దీంతో మోడీ వైఖరిపై అందరూ మండిపడ్డారు. ప్రసంగం నిస్తేజంగా ఓ ప్రహసనంలా సాగిందని ధ్వజమెత్తారు. జాతినుద్దేశించి మాట్లాడటం పార్లమెంట్ సమావేశాలకు ప్రత్యామ్నాయం కాదని, బాధ్యతల నుంచి ప్రధాని తప్పించుకోలేరని ప్రముఖ జర్నలిస్ట్ రాజు పార్లేకర్ వంటి వారు బహిరంగంగానే విమర్శించారు. 'ట్రంప్ వాణిజ్య వ్యాఖ్యల'పై తన ప్రసంగంలో ఒక్కమాట కూడా ప్రధాని ఎత్తలేదు. అయితే, ప్రసంగం అయ్యాక.. అమెరికాతో చర్చల్లో వాణిజ్యం ప్రస్తావనే రాలేదంటూ కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఓ మొక్కుబడి ప్రకటనను విడుదల చేశాయి. దీంతో నెటిజన్లు మరింతగా మండిపడ్డారు. మొత్తంగా తన ప్రసంగం కూడా ప్రభావం చూపలేదని గ్రహించిన ప్రధాని మోడీ మంగళవారం పంజాబ్‌లోని ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించి జవాన్లతో ముచ్చటించారు. పనిలోపనిగా సైనికుల్లో ధైర్యాన్ని నింపేలా ప్రసంగించారు. భారత ఆడపడుచుల సిందూరం తుడిచిన వారి నట్టింట్లోకి వెళ్లి మరీ నాశనం చేశామంటూ మాట్లాడారు. భారత్‌ను, ప్రజలను రక్షించుకోవడానికి ఎంత పెద్ద నిర్ణయమైనా తీసుకొంటామన్నారు. ఐతే, ఈ పర్యటన కూడా బెడిసికొట్టినట్టే కనిపిస్తోంది. జవాన్లతో మోడీ చేసిన వ్యాఖ్యలపై కూడా నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. 'పహల్గాం మహిళల సిందూరాన్ని దూరం చేసిన ఉగ్రవాదులను, వారిని ఎగదోసిన పాక్‌ను విడిచిపెట్టడమేనా మీరు చెప్తున్న ఆ పెద్ద నిర్ణయం' అంటూ నెటిజన్లు మోడీ వీడియోను ట్యాగ్ చేస్తూ ఎద్దేవా చేస్తున్నారు. యుద్దానికి ముందు లేదా యుద్ధం జరుగుతున్నప్పుడు నాయకుడు అనే వాడు సైన్యంలో ధైర్యాన్ని నూరిపోయడం చూశాంగానీ, యుద్ధం పూర్తయ్యాక వెళ్లడమేంటని మోడీని ఉద్దేశిస్తూ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. లైవ్ స్ట్రీమింగ్, యూట్యూబ్, ఎఫ్‌బీ, ఎక్స్ లైవ్ వీడియోల్లో మోడీ ప్రసంగాల కు వ్యూయర్‌షిప్ భారీగా తగ్గింది. మరోవైపు, 'కాల్పుల విరమణ' నిర్ణయంపై నెటిజన్లు మోడీ సర్కారుపై విమర్శలు చేయడం .. ఇంతలో 'మాదే విజయమ'ని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రకటించటం జరిగిపోయాయి. పాక్ సైనికులు మిఠాయిలు పంచుకొంటూ సంబురాలు చేసుకొన్న వీడియోలు వైరల్‌గా మారాయి. దీంతో మోడీ ప్రభుత్వంపై విమర్శల తీవ్రత మరింత పెరిగింది. ఇంటా బయటా ముప్పేట దాడి పెరుగుతుండటం, ఇంతలోనే 'కాల్పుల విరమణ' నిర్ణయాన్ని పక్కనబెట్టి సరిహద్దుల్లో పాక్ మళ్లీ డ్రోన్ల దాడులతో కవ్వింపులకు పాల్పడుతుండటంతో ఎన్డీయే ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అయ్యింది. డ్యామేజీ కంట్రోల్ చేసుకోకుంటే పరిస్థితి చేజారే ప్రమాదమున్నదని గ్రహించిన ప్రధాని మోడీ జాతినుద్దేశించి ప్రసంగించారు. అయితే, అంతకు ముందే లైన్‌లోని వచ్చిన ట్రంప్.. వాణిజ్యం ఆపేస్తానని బెదిరించడంతోనే భారత్–పాక్ కాల్పుల విరమణకు ఒప్పుకొన్నాయని బాంబు పేల్చారు. దీంతో మోడీ సర్కారు తీవ్ర ఇరకాటంలో పడింది. మొత్తంగా 'కాల్పుల విరమణ' ప్రకటన, దాని తదనంతర పరిణామాలపై ప్రధాని మోడీ ఆత్మరక్షణలో పడి ఇమేజ్ మేకోవర్ కోసం ప్రయత్నిస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆ ప్రయత్నాలు కూడా విఫలమవుతున్నాయని చెప్తున్నారు. రాబోవు రోజులలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో వేచి చూడాలి.



# వెనక్కి తగ్గిన అమెరికా - చైనా

**వే**లంపాట తరహాలో అమెరికా, చైనాలు ఒకరిపై ఒకరు సుంకాలు పెంచుకుంటూ పోయిన వైనంతో బెంబేలెత్తిన ప్రపంచ మార్కెట్లూ, ఆర్థిక వ్యవస్థలూ నేల చూపులు చూస్తున్న వేళ జెనీవా నుంచి సోమవారం ఒక చల్లని కబురు వినబడింది. ఆర్థికంగా ప్రపంచంలోనే ఒకటి, రెండు స్థానాల్లో ఉన్న ఇరు దేశాలూ ప్రస్తుతానికి వెనక్కి తగ్గాలని నిర్ణయించుకున్నాయన్నదే దాని సారాంశం. ఇది బుధవారం నుంచి అమల్లోకొచ్చి తొంభై రోజులపాటు... అంటే మూణ్ణెల్లపాటు అమల్లో వుంటుందనీ, రెండు దేశాల ప్రతినిధులతో ఏర్పడిన సలహా యంత్రాంగం ద్వైపాక్షిక ఆర్థిక, వాణిజ్య సమస్యలను చర్చించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తుందనీ ఉమ్మడి ప్రకటన వివరిస్తోంది. ఈ సలహా యంత్రాంగంలో చైనా తరఫున ఆ దేశ ఉపప్రధాని హెూ లిఫాంగ్ , అమెరికా తరఫున ఆర్థికమంత్రి స్కాట్ బిసెంట్, వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీయర్‌లుంటారు. మూర?త్వంలో ఎవరికెవరూ తీసిపోని ఈ రెండు పక్షాలూ చివరికేం చేస్తాయన్నది ఇంకా చూడాల్సేవున్నా ఇప్పటికైతే ఒక ముప్పు తాత్కాలికంగానైనా ఉపశమించిందని సంతోషించక తప్పదు. మొన్న జనవరిలో అమెరికాలో అధికార పగ్గాలు చేపట్టినప్పటి నుంచీ ప్రపంచాన్ని హడలెత్తిస్తూ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీసుకున్న వరస నిర్ణయాల్లో ఈ సుంకాల పెంపు వ్యవహారం అతి పెద్దది.

గత నెల 2 నుంచి అమల్లోకొచ్చిన ఈ పెంపు చైనా మినహా వేరే దేశాలపై తాత్కాలికంగా ఆపేస్తున్నట్టు ట్రంప్ ఆ వెంటనే ప్రకటించారు. కానీ కోడెల పోట్లాటల మధ్య లేగల కాళ్లు విరిగినట్టు అమెరికా–చైనా సుంకాల యుద్ధంతో ప్రపంచమంతటికీ సమస్యలు తలెత్తాయి. తాజా ఒప్పందం పర్యవసానంగా అమెరికా విధించిన 145 శాతం సుంకాలు కాస్తా 30 శాతానికి తగ్గుతాయి. అలాగే అమెరికా దిగుమతులపై చైనా విధించిన 125 శాతం సుంకాలు 10 శాతానికి దిగొస్తాయి. ఈ వారం ఆఖరులోగా తాను చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో చర్చిస్తానని ట్రంప్ చెప్పటం కూడా సంతోషించదగ్గది. చైనాతో సుంకాల విషయమై చర్చలు సాగుతున్నాయని ఆ మధ్య ట్రంప్ పదే పదే ప్రకటించగా చైనా ఖండించింది. చివరకు స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో చర్చలు సాకారమయ్యాయి.

చైనాను దెబ్బతీసే ఉద్దేశం తమకు మొదణ్ణించీ లేదని ట్రంప్ ప్రకటించారు. ఇది స్వాగతించ దగ్గదే అయినా బడాయి మాటనే చెప్పాలి. ఎందుకంటే ఆ దేశాన్ని దెబ్బతీయటం సంగతలా వుంచి అమెరికాలోని తయారీరంగ పరిశ్రమలు ముడిసరుకులు దొరక్క ఇబ్బందులుపడుతూ దివాలా దశకు చేరాయి. ఉద్యోగాలకు కోతబెట్టాయి.

వినియోగదారులు సైతం ఉత్పత్తులు అందుబాటులో లేకపోవటంతో పాటు, లభ్యమైన సరుకు ధర ఆకాశాన్నంటడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఉద్యోగాలు కోల్పోయి సతమతమవుతుంటే సరుకును రెట్టింపు, అంతకన్నా ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి రావటం వారిని కుంగదీసింది. చైనాలోనూ పరిస్థితి ఏమంత సజావుగా లేదు. అనేక కంపెనీలు మూతబడ్డాయి. కొన్ని సంస్థలు ఆగ్నేయాసియా దేశాలకు ఎగుమతులపై దృష్టి సారించాయి.

ట్రంప్ అధికారంలోకొస్తూనే దేశంలో యువత ప్రాణాలు తీస్తున్న మత్తు పదార్థం ఫెంటానిల్ విచ్చలవిడిగా దొరకటంలో చైనా పాత్రవుందని ఆరోపిస్తూ ఆ దేశం నుంచి వచ్చే దిగుమతులపై 20 శాతం అదనంగా సుంకాలు పెంచారు. గత నెల 2 నుంచి దానికి మరో 34 శాతం జోడించారు. ఇలా తమ నుంచి వెళ్లిన సరుకులపై 54 శాతం సుంకాలు విధించటాన్ని జీర్ణించుకోలేని చైనా దానికి ప్రతీ కారంగా అమెరికా దిగుమతులపై 34 శాతం మేర అదనపు సుంకాలు విధించింది.

ఇక అక్కడి నుంచి ఇద్దరిమధ్యా 'చంపుడు పందెం' మొదలైంది. నిజానికి ట్రంప్‌కు ముందు ఫెంటానిల్‌తో చైనాకు లంకె పెట్టినవారెవరూ లేరు. అధ్యక్ష ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలను ఆశించి ఆయన దాన్ని ఎక్కువచేసి చూపారు. మొత్తానికి అమెరికా 145 శాతం, చైనా 125 శాతం సుంకాల దగ్గర ఆగాయి.

ఇప్పుడు కుదిరిన ఒప్పందం పర్యవసానంగా గంపగుత్తగా అన్ని రకాల సరుకులపైనా సుంకాలు తగ్గిపోవు. చైనా సరుకులపై అమెరికా విధించిన 30 శాతం సుంకాలు కొనసాగుతాయి. అలాగే విద్యుత్ వాహనాలు, ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై ఇంతకన్నా ఎక్కువగానే సుంకాలున్నాయి. అవన్నీ గత కొన్ని సంవత్సరాల్లో విధించినవి కనుక ఈ ఒప్పందం వాటి జోలికిపోదు.

అవతలిపక్షం నుంచి ఎలాంటి రాయితీలూ పొందకుండా, తమకనుకూలమైన ముగింపు వైపుగా చర్యలేమీ కనబడకుండా ఒప్పందానికి రావటం బలహీనతను సూచిస్తుంది తప్ప బలాన్ని కాదు. ప్రస్తుత ఒప్పందం వ్యూహాత్మకమైనదని చెప్పుకున్నా, ముమ్ముందు దేశానికేదో ఒరుగుతుందని అంటున్నా... అధిక సుంకాల మోత నుంచి వెనక్కి తగ్గమని ట్రంప్‌పై దేశంలో అన్నివైపుల నుంచీ ఒత్తిళ్లు వచ్చాయన్నది వాస్తవం.

నిరుటి గణాంకాలు గమనిస్తే రెండు దేశాలూ వాణిజ్య పరంగా పరస్పరం ఆధారపడినవేనని తెలుస్తుంది. చైనా ఎగుమతుల్లో అమెరికా వాటా 12.9 శాతం. అలాగే అమెరికా మొత్తం ఎగుమతుల్లో చైనా వాటా 14.8 శాతం. కెనడా, మెక్సికోల తర్వాత స్థానం చైనాదే. అధిక సుంకాల యుద్ధం చివరకు ప్రపంచ ఆర్థికాభివృద్ధిని మందగింపజేస్తుందని, ఉత్పత్తుల కొరతను సృష్టించి ద్రవ్యోల్బణానికి దారితీస్తుందని... ఇదంతా చిట్టచివరకు అమెరికాను మాంద్యం ఊబిలోకి నెడుతుందని నిపుణులు మొదణ్ణించీ హెచ్చరిస్తూనే ఉన్నారు.

సర్వజ్ఞుణ్ణని భావించేవారికి చెప్పటానికి ప్రయత్నించటం వృథా ప్రయాస.

క్రైమ్ మిర్రర్
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 16-5-2025


# లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలి: కల్లూరి మల్లేశం

## మే 20 సమ్మె జయప్రదం కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ

## ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్ లకు జైలు శిక్ష, జరిమానా విధించే సెక్షన్ లను రద్దు చేసే వరకు పోరాటం ఆగదు





చౌటుప్పల్, క్రైమ్ మిర్రర్: ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్ లకు 10 సంవత్సరాలు జైలు శిక్ష, ఏడు లక్షల జరిమానా విధించే బిఎన్ఎస్ 106(1)(2) సెక్షన్ లను రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని యూనియన్ కేంద్ర కమిటీ సభ్యులు కల్లూరి మల్లేశం అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం దండు మల్కాపురంలో ట్రాన్స్ పోర్ట్ యూనియన్ ఆధ్వర్యంలో దండు మల్కాపురం గ్రామంలోని దేవుని గుడి నుండి ఇండస్ట్రియల్ పార్కు మీదుగా పారిశ్రామిక ప్రాంతంలో గురువారం ట్రాన్స్ పోర్ట్ కార్మికులు పెద్ద ఎత్తున ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా రోడ్డు ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కేంద్ర కమిటీ సభ్యులు కల్లూరి మల్లేశం, యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎండి పాషా లు పాల్గొని వారి చేతుల మీదుగా జెండా ఊపి ట్రాక్టర్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... మే 20 న జరిగే జాతీయ కార్మిక సమ్మెలో ట్రాన్స్ పోర్ట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కల్లూరి మల్లేశం కార్మికులకు పిలుపునిచ్చారు. లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్ అనుకూల విధానాలను అమలుచేస్తున్నదని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి మోడీ కార్మిక వ్యతిరేక విధానాలు అమలుచేస్తున్నాడని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని సిఐటియుతో పాటు జాతీయ కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ లు, రాష్ట్ర వ్యాపిత కార్మిక సంఘాలు మే20 జాతీయ సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. ఈ సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. 10 సంవత్సరాలు జైలు శిక్ష , ఏడు లక్షల జరిమానా ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్లకు కఠినంగా శిక్ష విధించే భారత న్యాయ సంహిత సెక్షన్ 106(1)(2) ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. డ్రైవర్ ల లైసెన్స్ లు, వాహన రిజిస్ట్రేషన్ లను సైతం నూతన మోటార్ వాహన చట్టం -2019 ప్రకారం ప్రైవేట్ ఏజెన్సీ లకు ఇస్తారని, అధిక ఫైన్ లు వేస్తారని డ్రైవర్ లకు నష్టం చేసే ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం రద్దు అయ్యేవరకు జరగబోయే పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని, మే 20న జరిగే సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ పోర్ట్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎండి పాషా , నాయకులు బత్తుల దాసు, శ్రీనివాస్ రెడ్డి, ఎస్ డి ఉమర్, రమేష్, బాలరాజు అందోల్ మాత ట్రాక్టర్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు స్వామి గౌడ్, జావీద్, నాయకులు దేవయ్య, సుంకరి రమేష్ గౌడ్, కృష్ణ, మధుసూదన్ రెడ్డి, లింగస్వామి, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సంజీవరెడ్డి, మీసాల రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నీళ్లు ఇవ్వలేని పాలన ఏమిటి?"

## బండ్లగూడ జాగిర్‌లో బి ఆర్ ఎస్ బహిరంగ హెచ్చరిక

## మిషన్ భగీరథ ఎక్కడ..? - మళ్లీ బిందెల దుస్థితి

## నీటి ఎద్దడి కాదు... ఇది పాలన వైఫల్యం!

### "నీళ్లు ఇవ్వలేని పాలకులు రాజీనామా చేయాలి: బి ఆర్ ఎస్ నేత రాముడు యాదవ్




గండిపేట్: ( క్రైమ్ మిర్రర్): బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో నీటి ఎద్దడి తారాస్థాయికి చేరింది. తాగడానికి చుక్క నీళ్లు లేక ప్రజలు నరకం అనుభవిస్తున్నా, జలమండలి అధికారులు కనీస స్పందన చూపడం లేదు. ఈ నిర్లక్ష్యాన్ని కఠినంగా ప్రశ్నిస్తూ భారతీయ రాష్ట్ర సమితి పార్టీ ప్రధాన కార్యదర్శి వి. రాముడు యాదవ్ నేతృత్వంలో జనసమావేశం ఏర్పాటు చేసి అధికారులను బహిరంగంగా హెచ్చరించారు. ఇంటికి ఇంటి నుంచి పన్నులు వసూలు చేస్తున్న జలమండలి, నీళ్లు మాత్రం ఇవ్వలేకపోతే అది పాలనా వైఫల్యం కాదు. అది ప్రజలపై జరుగుతున్న రాజకీయం అంటూ ఆయన ధ్వజమెత్తారు. మాధవి నగర్, సాయి బాలాజీ నగర్, ఇండస్ వ్యాలీ వంటి ప్రాంతాల్లో ప్రజలు వారం వారం నీటి కోసం ఎదురు చూస్తూ పడుతున్న అవస్థలను వివరించారు. ఇది నీటి సమస్య కాదు, ఇది ప్రణాళికల లేమి. ఇది పాలకుల అసమర్థత, అంటూ అధికారుల తీరుపై గట్టిగా విమర్శలు గుప్పించారు రాముడు యాదవ్. బోర్లు ఎండిపోవడం, ట్యాంకర్లు కొనలేని సామాన్య ప్రజలు కన్నీళ్లు గార్చుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మిషన్ భగీరథ పేరుతో ఫొటోలకు నిలబడ్డవారు, ఇప్పుడు నీటి అవసరాలకు గళం ఎందుకు వినిపించడం లేదు? ప్రజలకు కచ్చితంగా, ప్రతి రోజు నీటి సరఫరా జరిగేలా చూడాలి. లేదంటే రోడ్డుపై ప్రజలు తమ శక్తిని చూపించేందుకు వెనుకాడరు అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహణ కార్యదర్శి గంగాని రవికుమార్ సహా వివిధ కాలనీల ప్రతినిధులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రైతుల కన్నీటికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి: రాంశెట్టి మనోజ్

## భారీ వర్షాలకు తడిసిన వడ్లను వెంటనే కొనుగోలు చేయాలి

## వరద ఉధృతికి కొట్టుకుపోయిన వడ్లకు నష్టపరిహారం చెల్లించాలి

## కొనుగోలు కేంద్రాలను చెరువులో పెట్టడం వల్లే వారి నష్టం : మనోజ్



క్రైమ్ మిర్రర్ మహదేవపూర్ ప్రతినిధి: మహాదేవ మండలంలోని వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతులు పడుతున్న ఇబ్బందులను గురించి బిజెపి మండల అధ్యక్షులు రామ్ శెట్టి మనోజ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం మహాదేవ్ పూర్ లో భారీ వర్షానికి వడ్ల కొనుగోలు కేంద్రం వద్ద తడిసినటువంటి వడ్లను వెంటనే కొనుగోలు చెయ్యాలని ,అలాగే అడివి నుండి వచ్చినటువంటి వరద ఉధృతికి వడ్లు కొట్టుకపోయి నష్టపోయినటువంటి రైతులకు పంట నష్ట%శీ% అంచనా వేసి నష్ట పరిహారం చెలించాలని, తడిసిన వడ్లను ఎలాంటి కటింగ్ లేకుండా ప్రభుత్వం ఇచ్చినటువంటి మద్దతు ధరతో కొనుగోలు చేయాలనీ, అలాగే అకాల వర్షం కారణంగా %ూాజూ% మరియు సంబంధిత సెంటర్ ఇంచార్జ్ ల నిర్లక్ష్యంతో వడ్ల కొనుగోలు కేంద్రంను చెరువు లో పెట్టడ%శీ% వలన ఇంతటి భారీ నష్టం జరిగిందని, ఈ నష్టానికి కారకులైన కళ్ళం నిర్వాహకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని మహాదేవపూర్ మండల వ్యవసాయ అధికారి (అగ్రికల్చర్ ఆఫీస్) మరియు మహాదేవపూర్ పోలిస్ స్టేషన్ లో కంప్లైంట్ ఇవ్వడం జరిగింది అని ఒకవేళ రైతులకు పూర్తి స్థాయి నష్ట పరిహారం చెల్లించని యెడల నష్టపోయిన రైతులతో కలిసి భారతీయ జనతా పార్టీ పక్షాన ఆందోళన కార్యక్రమాలు చెప్పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబెర్ ఆకుల శ్రీధర్, నాయకులు ఆడప లక్ష్మీనారాయణ, సాగర్ల రవి, వంశీ, వెంకటేష్, పూర్ణ చందర్, రాజు పాల్గొన్నారు,




# ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తిని కాపాడిన పోలీసులు

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హనుమాన్ నగర్ లో ఒక వ్యక్తి విషపూరిత పదార్థం తీసుకుని ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడన్న సమాచారం అందుకున్న మీర్పేట్ పోలీసులు ఘటన స్థలానికి వెంటనే చేరుకొని బలవంతంగా తలుపులను తెరిచి ఆ వ్యక్తిని ఆత్మహత్య ప్రయత్నం నుండి కాపాడి వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ కి తరలించడం జరిగింది. ఆ వ్యక్తి ఒక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సమాచారం అందుకున్న పోలీసులు స్పందించి ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడినందుకు స్థానికులు పోలీసులను అభినందించారు.

# నేడు తంగడపల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం

## చౌటుప్పల్ మండల వ్యవసాయ అధికారి నాగరాజు



చౌటుప్పల్, క్రైమ్ మిర్రర్: యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండల పరిధిలోని తంగడపల్లి గ్రామంలో వార్డు ఆఫీస్ వద్ద మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు అధ్యక్షతన నేడు శుక్రవారం " రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం " ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలతో నిర్వహించడం జరుగుతుందని వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు పత్రికకు ఇచ్చిన ప్రకటన ద్వారా తెలిపారు. కావున ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని రైతులు తప్పక సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# క్యాన్సర్ నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలి : డాక్టర్ గీతా నాగశ్రీ



గండిపేట్, (క్రైమ్ మిర్రర్) : క్యాన్సర్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భారత వికాస్ పరిషత్ గీత నాగశ్రీ అన్నారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో కార్మికులకు భారత్ వికాస్ పరిషత్ మణికొండ జిజియాబాద్ శాఖ తరపున 500 మంది మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు క్యాన్సర్ అవగాహన సదస్సు అనీమియా ముక్త్ భారత్ క్యాంపులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్, మాజీ వైస్ చైర్మన్ కే.నరేందర్ రెడ్డి, రవి కాంత్ రెడ్డి, ధూళిపాల సీతారాం, కే.ఆంజనేయులు, రామకృష్ణ రెడ్డి, బీరప్ప, సిద్ధప్ప, యాలాల నరేష్, వందన, జిజాబాయి బ్రాంచ్ చీఫ్ ప్యాట్రన్ ఎస్‌బీ.రాజశేఖర్, అడ్వైజర్ ప్రభుజి, అధ్యక్షులు ఎం పెంటారెడ్డి, జనరల్ సెక్రటరీ కే. బాల భారతి, ఫైనాన్స్ సెక్రటరీ టి.హరిహర, అజయ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాస్కర్, వారి సహచర బృందం తదితరులు పాల్గొన్నారు.



# జులై 15 కల్లా ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు పూర్తి చేయాలి...

### రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు.

### 80 శాతానికి పైగా పనులు పూర్తి.

### గ్రీన్ ఫీల్డ్ హైవే పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి తుమ్మల నాగేశ్వరావు



**ఖమ్మం( క్రైమ్ మిర్రర్ ప్రతినిధి) మే 15:** జులై 15 కల్లా ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులో తేవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళీ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మంత్రి, అధికారులతో కలిసి వేంసూరు నుండి ధాంసలాపురం వరకు ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే గుండా ప్రయాణిస్తూ, క్షేత్ర స్థాయిలో పనుల పురోగతిని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఖమ్మం- దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే జిల్లాలో 3 ప్యాకేజులుగా విభజించి పనులు పురోగతి లో ఉన్నాయన్నారు. పనులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి, సమస్యలు గురించి తెలుసుకోవడానికి పర్యటిస్తున్నట్లు తెలిపారు. జులై 15 కల్లా పూర్తిస్థాయిలో పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులో తేవాలని అధికారులను ఆదేశించారు.ప్యాజేజి-1 క్రింద తల్లంపాడు నుండి సోమవరం వరకు 30 కి.మీ. మేర రోడ్డు నిర్మాణం రూ. 772.11 కోట్ల అంచనాలతో చేపట్టగా, 75 శాతం పనులు పూర్తయినట్లు అన్నారు. ఇట్టి ప్యాకేజీలో 32 స్ట్రక్చర్లు ఉండగా, 29 పూర్తయ్యాయని తెలిపారు. ధాంసలాపురం వద్ద ఎన్ఎస్పి కాల్వలో పిల్లర్ల విషయమై అలైన్మెంట్ లో కాస్త ఆలస్యం అవగా, ప్రస్తుతం పనులు వడివడిగా సాగుతున్నాయన్నారు. ప్యాకేజి-2 క్రింద సోమవరం నుండి చింతగూడెం వరకు 27 కి.మీ. మేర రూ. 637.11 కోట్ల అంచనాలతో పనులు చేపట్టినట్లు, ఇప్పటివరకు 81 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. ఇట్టి ప్యాకేజీలో 39 స్ట్రక్చర్లకు గాను 35 నిర్మాణాలు పూర్తయినట్లు ఆయన అన్నారు.

ప్యాకేజి-3 క్రింద చింతగూడెం నుండి రేచర్ల వరకు 38 కి.మీ. మేర రూ. 804.69 కోట్ల వ్యయ అంచనాలతో పనులు చేపట్టగా, ఇప్పటి వరకు 85 శాతం పనులు పూర్తయినట్లు అన్నారు. ఈ ప్యాకేజి కి సంబంధించి 55 స్ట్రక్చర్లు ఉండగా, 51 నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. పనుల పురోగతికి ఎటువంటి సమస్యలు లేవని, అన్ని ప్యాకేజీలలో పనులు సమాంతరంగా కొనసాగుతున్నాయని అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో సర్వీస్ రోడ్ విషయమై ప్రతిపాదనలు సమర్పించి, మంజూరు చేయిస్తామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రాంత మంత వ్యవసాయ ప్రాంతం కావున, సర్వీస్ రోడ్ చాలా అవసరమని మంత్రి అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే లో సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో 3 ఎక్జిట్లు ఉన్నాయని, దేశంలోని ఏ రాష్ట్రంలోని నియోజకవర్గ పరిధిలో గ్రీన్ ఫీల్డ్ హైవే లో 3 ఎక్జిట్లు లేవని మంత్రి అన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే అందుబాటులోకి వస్తే, ప్రయాణ సమయం ఎంతో ఆదా అవుతుందని, రవాణా వ్యవస్థ మెరుగవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, నేషనల్ హైవే పిడి దివ్య, కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.జిల్లా పౌరసంబంధాల అధికారి, ఖమ్మం కార్యాలయంచే జారీచేయనైనది.



## కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి కలెక్టర్

నూతనకల్(క్రైమ్ మిర్రర్): మండల పరిధిలోని ఎర్రపహడ్ ఐకేపీ ధాన్యం సెంటర్ ను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ గురువారం పరిశీలించారు.ధాన్యం కంటాల వివరాలు,బుక్స్ వెరిఫికేషన్ ట్యాబు ఎంట్రీ సెంటర్ లో కాంటాలు కావలసిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఏపీఎం రమణాకర్ వివరిస్తూ మండలంలో సుమారుగా 30 వేల క్వింటల ధాన్యం కాంటాలు కావలసి ఉన్నదని తెలిపారు.లారీలు త్వరగా అన్లోడ్ కావటం లేదని తెలుపగా హుజుర్నగర్ ఆర్ఐ తో మాట్లాడి త్వరగా దిగుమతి చేయించాలని లారీలు త్వరగా పంపించాలని, నూతనకల్ మండలం కు అదనంగా 10 లారీలను పంపించాలని సివిల్ సప్లై డీసీఎం ను ఆదేశించించారు.అనంతరం కాంట వేసిన బస్తాలను పరిశీలించి పూర్తి నాణ్యత ప్రమాణాలు ఉన్న ధాన్యం ను కొనుగోలు చేయాలని ఈ నెల 20 వ తారీకు వరకు సాధ్యమైనంత వరకు కాంటలు పూర్తి చేయాలనీ ఆదేశించారు.ఈ కార్యక్రమం లో డీఎం సివిల్ సప్లై ప్రసాద్ ,తహసీల్దార్ శ్రీనివాస రావు, ఎంపీడీవో సునీత,ఏపివో శ్రీరాములు,ఏవో మురళి,ఏఇవో,సీసీ ముత్తయ్య, సరస్వతి,బండపెల్లి గీత,ట్యాబు ఆపరేటర్,పద్మ, లింగాల సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రైతు కమిషన్ సభ్యునికి వినతి



క్రైమ్ మిర్రర్ మద్దిరాల: మద్దిరాల మండలం కుక్కడం కుంటపల్లి, గుమ్మడవల్లి గ్రామానికి చెందిన రైతులందరూ రైతు కమిషన్ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. వీరందరూ మాజీ ఎంపీటీసీ అందెం మల్లయ్య గౌడ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. రైతులందరూ కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని తూకం వేసినంక మాట మారుస్తున్న కంపెనీలపై చర్య తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. వివరాల్లోకి వెళితే వివిధ గ్రామాల్లోని రైతులందరికీ ఆడ మగ విత్తనాలు అందజేసి మేమే కొంటామని చెప్పి పండించిన తర్వాత తిరిగి కొనేటప్పుడు కొర్రీలు పెడుతూ కింటాకు 10 కేజీల నుండి 20 కేజీల వరకు తూకాన్ని కట్ చేస్తున్నందుకు రైతులందరూ కలిసి తమ సమస్యను పరిష్కరించి బోగస్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్ కు వినతిపత్రం అందజేసినారు ఈ కార్యక్రమంలోభాస్కర్, బాలాజీ, దేవుల, ఊర్లు, నరసయ్య, మల్లయ్య, రాములు, పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన తప్ప ఏమీ లేదు

### చట్టాన్ని అతిక్రమించే పోలీసులపై చర్యలు తప్పవు

### మాజీమంత్రి అంబటి రాంబాబు హెచ్చరిక

**గుంటూరు, (క్రైమ్ మిర్రర్):** కొంతమంది పోలీస్ అధికారులు చట్టాన్ని అతిక్రమిస్తున్నారు.. వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదు.. నిబంధనలు అతిక్రమించిన పోలీసు అధికారులను ఎవర్ని వదలం.. కచ్చితంగా చట్టం ముందు దోషులుగా నిలబెడతామని మాజీ మంత్రి అంబటి రాంబాబు హెచ్చరించారు.. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి కొద్ది రోజుల్లో సంవత్సరం కావస్తుంది.. వైసీపీ గత 5 ఏళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి, విశ్వసనీయత, ప్రజల కొనుగోళ్లు అన్ని బాగున్నాయి.. రాష్ట్రం అభివృద్ధి చెందింది.. కూటమి ఏడాది పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రం తిరోగమనం దిశగా అడుగులు వేస్తుందని విమర్శించారు.. వైఎస్ జగన్ ను ఏ విధంగా ఇబ్బంది పెడదాం అనే ధ్యాస తప్ప ప్రభుత్వానికి ఏమీ లేదు.. రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన తప్ప ఏమీ లేదు.. ప్రజలు సూపర్ సిక్స్ హామీలు ఎక్కడ అని ప్రశ్నిస్తున్నారని అంబటి అన్నారు.. వైఎస్ జగన్ మొదట బిజినెస్‌లో భాగంగా భారతి సిమెంట్ ను ప్రారంభించారు. లేని పోనీ కారణాలు చూపించి భారతి సిమెంట్ సంస్థ సెక్రెటరీ బాలాజీ గోవిందప్పను విజయవాడ జైలుకు పంపిస్తున్నారని ఆరోపించారు అంబటి రాంబాబు.. దేశంలో ఎక్కడ లేని విధంగా ఐజీ స్థాయి వ్యక్తిని అరెస్ట్ చేస్తున్నారు. ఈ విధంగా ఇండస్ట్రీ ప్రతినిధులను భయపెడితే ఏ విధంగా ఏపీకి పరిశ్రమలు వస్తాయి.? అని ప్రశ్నించారు.. రౌడీ మాములు ఇవ్వకపోతే పరిశ్రమలకు అనుమతులు ఇవ్వమని కూటమి ప్రజా ప్రతినిధులు తెగేసి చెప్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రజా ప్రతినిధులు బరితెగించి మరి దోచుకుంటు-న్నారు.

# వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ స్కామ్


### ముంబై, హైదరాబాద్‌లలో ఇడి సోదాలు.. భారీగా నగదు, ఆభరణాలు స్వాధీనం

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్‌లో మరోసారి ఈడీ సోదాలు కలకలం సృష్టించాయి. ముంబయి వసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ స్కామ్‌లో దర్యాప్తును ఈడీ ముమ్మరం చేసింది. ముంబయి వసాయి విరార్ మున్సిపల్ కార్పోరేషన్ స్కామ్‌లో భాగంగా ఈడీ అధికారులు.. ముంబై, హైదరాబాద్‌తో పాటు 12 ప్రాంతాల్లో గురువారం సోదాలు నిర్వహించారు. ముంబైలో టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ- డైరెక్టర్‌గా పనిచేస్తున్న వైఎస్ రెడ్డి నివాసంలో ఈడీ అధికారులు తనిఖీలు చేసి.. భారీగా నగదును గుర్తించినట్లు సమాచారం. మొత్తం రూ.9 కోట్లకు పైగా నగదుతో పాటు రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తులో భాగంగా గురువారం ముంబయి, హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. రూ.9.04 కోట్ల నగదు, రూ.23.25 కోట్లు విలువ చేసే బంగారం, వజ్రాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ తెలిపింది. ముంబయిలోని మిరా భయాందర్ కమిషనరేట్ పరిధిలో నమోదైన కేసుల ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు- స్థలాల్లో అక్రమ నిర్మాణాలకు 2009 నుంచి అనుమతులు ఇచ్చారు. ఈ కేసులో సీతారాం గుప్తా, అరుణ్ గుప్తా కీలక నిందితులుగా ఉన్నారు. నిందితులు అధికారులతో కలిసి ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టి ప్రజలకు విక్రయించినట్టు- దర్యాప్తులో తేలింది. ఇందులో భాగంగా వీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ- డైరెక్టర్ వైఎస్ రెడ్డి నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించింది. సోదాల్లో నిందితుల ఇళ్లలో నగదు, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ తెలిపింది.

## లభ్యం కాని మాజీమంత్రి కాకాణి ఆచూకీ

### రెండు నెలలుగా ముమ్మరంగా గాలింపు

**నెల్లూరు, (క్రైమ్ మిర్రర్):** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. క్వార్జ్ కేసులో రెండు నెలలుగా కాకాణి తప్పించుకుని తిరుగుతున్నారు. దీంతో హైదరాబాద్, బెంగళూర్‌లో నెల్లూరు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కాకాణి బంధువుల ఇళ్లు, ఫాంహౌజ్‌లలో గాలిస్తున్నారు. మరోవైపు క్వార్జ్ కేసులో మరో 12 మందికి పోలీసులు నోటీ-సులు ఇచ్చారు. క్వార్జ్ కేసులో మాజీ మంత్రి కాకాణి ఏ4గా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి గతంలో హైకోర్టును ఆశ్రయించి బెయిల్ పొందే ప్రయత్నాలు చేశారు. అయితే ఆ ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. దాంతో రెండు నెలలుగా మాజీ మంత్రి పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నారు. హైదరాబాద్‌లో కొద్దిరోజులు, బెంగళూర్‌లో కొన్నాళ్లు ఉంటూ పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నట్లు- తెలుస్తోంది. కనీసం ఇంట్లో వాళ్లకు కూడా వాట్సప్ కాల్ మాట్లాడనట్లు- సమాచారం. నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాస్ నేతృత్వంలో రెండు పోలీసు బృందాలు బెంగళూరులో పెద్ద ఎత్తున్న విస్తృతంగా జల్లెడపడుతున్నాయి. రి-టైర్డ్ ఐఆర్ఎస్ అధికారికి సంబంధించిన ఇళ్లల్లోనే కొంతకాలం వరకు తలదాచుకున్నట్లు- సమాచారం. దీంతో పోలీసులు అక్కడ కూడా తనిఖీలు చేపట్టారు. బెంగళూరులోని కాకాణి స్నేహితులు, బంధువులకు సంబంధించిన ఇళ్లు, ఫాంహౌజ్‌లు, గెస్ట్‌హౌజ్‌లలో కూడా పోలీసులు జల్లెపడుతున్నారు. కాకాణి కోసం గాలింపు



ముమ్మరం చేశారు. మరోవైపు హైదరాబాద్‌లో కూడా రెండు పోలీసు బృందాలు కాకాణి కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయి. అంతేకాకుండా ఈ కేసుకు సంబంధించి పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ సాగిస్తున్నారు. ఈ క్రమంలో సుప్రజ అనే మహిళ అకౌంట్‌లోకి భారీ ఎత్తున కోట్లాది రూపాయలు ట్రాన్సాక్షన్స్ జరిగినట్లు- గుర్తించారు. ఆమె ఇంటికి కూడా పోలీసులు వెళ్లి నోటీ-సులు ఇచ్చేందుకు ప్రయత్నించారు. అయితే ఆమె నోటీ-సులు తీసుకోకపోవడంతో ఇంటి గోడకు నోటీ-సులు అంటించారు. అలాగే ఈ కేసులో 12 మందిని పోలీసులు గుర్తించారు. అందులో కాకాణి అల్లుడు కూడా ఉన్నారు. వీరందరికీ నోటీ-సులు ఇచ్చేందుకు వెళ్లగా.. వారు లేకపోవడంతో ఇంటి గోడలకు నోటీ-సులు అంటించి వస్తున్నారు. రెండు మూడు సార్లు నోటీ-సులు ఇచ్చాక వారు స్పందించకపోతే వారందరినీ కూడా అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు- తెలుస్తోంది. ప్రస్తుతం క్వార్జ్ కేసు విచారణ చాలా వేగవంతంగా సాగుతోంది. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో పోలీసులు బృందాలు యాక్టివ్‌గా పనిచేస్తూ గతంలో కంటే కూడా గాలింపును ముమ్మరం చేశాయి.

## బహుభార్యత్వం దుర్వినియోగాన్ని సహించం

### ఖురాన్ మేరకు భార్యలను సమానంగా చూసుకోవాలి

### అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు

**లక్నో, (క్రైమ్ మిర్రర్):** అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. ముస్లిం వ్యక్తి ఎంత మందినైనా పెళ్లి చేసుకోవచ్చని,కానీ దానికి సరైన కారణం ఉండాలన్నది. భార్యలందర్నీ ఆ వ్యక్తి సమానంగా చూసుకోవాలని కోర్టు తన తీర్పులో పేర్కొన్నది. భార్యలందర్నీ సమానంగా చూసుకోలేని పక్షంలో ముస్లిం వ్యక్తి మరో వివాహానికి అర్హుడు కాదని కోర్టు చెప్పింది.జస్టిస్ రుణ్ కుమార్ సింగ్ దేశ్‌వాల్ నేతృత్వంలోని సింగిల్ బెంచ్ ఈ తీర్పునిచ్చింది. బహుభార్యత్వాన్ని ఖురాన్ ఆమోదిస్తుందని, కానీ సరైన కారణం ఉండాలని కోర్టు చెప్పింది. ఖురాన్‌లో ఉన్న ఆ వెసలుబాటును స్వార్థ ప్రయోజనాల కోసం మగవాళ్లు వాడుకుంటున్నట్లు కోర్టు పేర్కొన్నది.షరతు ప్రకారం బహుభార్యత్వం ఆమోదంయోగ్యమని కోర్టు తెలిపింది. మొరాబాద్‌కు చెందిన జిల్లా కోర్టు ఓ పిటీషనర్‌కు సమన్లు జారీ చేసిన కేసులో.. అలహాబాద్ హైకోర్టు ఈ కీలక తీర్పును ఇచ్చింది. మొదటి పెళ్లి గురించి దాచి పెట్టాడని, రిలేషన్‌లో ఉన్న సమయంలో తనను లైంగికంగా వేధించాడని రెండో భార్య తన ఫిర్యాదులో పేర్కొన్నది. ముస్లిం చట్టాల ప్రకారం ఇస్లాంలో కొన్ని సందర్భాల్లో ఒకటి కన్నా ఎక్కువ పెండ్లిళ్లు చేసుకునే సౌలభ్యం ఉన్నట్లు హైకోర్టు తెలిపింది. కానీ దీనికి కొన్ని నిబంధనలు ఉంటాయన్నది. అయితే ఖురాన్ కల్పించిన ఆ పరిమితులను ఉల్లంఘిస్తూ దుర్వినియోగం చేస్తున్నట్లు కోర్టు పేర్కొన్నది. బహుభార్యత్వాన్ని ఖురాన్ ఆమోదించడానికి ఓ కారణం ఉందని, పూర్వం ఓ దశలో చాలా మంది మహిళలు వితంతువులు అయ్యేవారని, పిల్లలు అనాథలయ్యేవారని, అరబ్ దేశాల్లో ఇలాంటి సమస్య ఎక్కువగా ఉండేదని, మదీనాలో ముస్లిం వర్గానికి తీవ్ర నష్టం జరిగిందని, ఆ దశలో బహుభార్యత్వాన్ని ఖురాన్ అంగీకరించిందని, అనాథ పిల్లలను.. వారి తల్లులను రక్షించే ఉద్దేశంతో ఆ ప్రతిపాదన జరిగినట్లు- కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది.

# వింతైన వంతారా!

వింతైన ఆ జంతు ప్రపంచం చూసొద్దాం రండి!

వింతైన ఆ జంతు ప్రపంచం చూసొద్దాం రండి! చిన్న పిల్లలకి సహజంగానే జంతువులంటే ఆకర్షణ ఉంటుంది. వాటితో చాలా తొందరగా బంధాన్ని ఏర్పరచుకోగలుగుతారు. వాళ్ల కథల్లోనూ కార్టూన్లలోనూ కూడా ఎప్పుడూ అవే ఉంటాయి. వాటికి ఎలాంటి కష్టమొచ్చినా అయ్యో అని బాధపడిపోతుంటారు.







చిన్న పిల్లలకి సహజంగానే జంతువులంటే ఆకర్షణ ఉంటుంది. వాటితో చాలా తొందరగా బంధాన్ని ఏర్పరచుకోగలుగుతారు. వాళ్ల కథల్లోనూ కార్టూన్లలోనూ కూడా ఎప్పుడూ అవే ఉంటాయి. వాటికి ఎలాంటి కష్టమొచ్చినా అయ్యో అని బాధపడిపోతుంటారు. అయితే, అలాంటి ఓ పిల్లాడి అనుబంధమే నేడు 200 ఏనుగులు సహా 2000 దాకా జంతువులను కాపాడే ఓ వన్యప్రాణి సంరక్షణా కేంద్రం ఏర్పాటుకు కారణమైంది. కొన్ని వందల మంది డాక్టర్లు, నిపుణులు వాటి బాగోగులు చూసుకునే బాటయింది. రిలయన్స్ సంస్థల అధినేత ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీనే ఆ పిల్లవాడు. ఇక, వింతైన ఆ జంతు ప్రపంచమే గుజరాత్ రాష్ట్రపు జామ్ నగరలో ఉన్న 'వంతారా జూ'! అనంత్ అంబానీకి పన్నెండేండ్ల వయసులో తల్లి నీతాతో కలిసి ఓ ఊరికి వెళుతున్నాడు. అందమైన చెట్లు, పరిగెడుతున్నాయా అనిపించే ఊళ్లూ చూస్తూ కూర్చున్నాడు అనంత్. అదే దారిలో ఓ ఏనుగు పిల్ల కనిపించిందతనికి. ఇంకేం, ఎగిరి గంతేసినంత పనిచేశాడు. కానీ పరిశీలించి చూస్తే పాపం అది ఎంతో ఇబ్బందిగా నడుస్తున్నది. మావటి వాడు దాన్ని ఎలాగోలా తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు. అది చూసిన అనంత్ మనసు చలించిపోయింది. 'పాపం కదా అమ్మా%ొ% మనం పెంచుకుందామా దాన్ని' అని అడిగాడు. 'సరే నువ్వు జాగ్రత్తగా చూసుకుంటావా మరి'%ొ%అని అడిగింది తల్లి. 'అవునమ్మా%ొ% నేను దాన్ని బాగా చూసుకుంటాను%ొ%' అని చెప్పాడా పిల్లవాడు. అలా ఆ ఏనుగు పిల్ల అనంత్ దగ్గరికి చేరింది. 'దాన్ని తీసుకున్నప్పటికి కనీసం అది ఏం తింటుందో కూడా తెలీదు' అని చెబుతాడు అనంత్. 'మావటి వాడు ఏం చెబితే అదే పెట్టేవాళ్లం. దానికి ఏమైనా అయితే చికిత్స చేయించడానికి కూడా పెద్దగా నిపుణులు అందుబాటులో లేరు. అయితే ఇన్నాళ్లలో మేం చాలా నేర్చుకున్నాం. ఆ ఒక్క ఏనుగే కాదు, ఎన్నో ఆపదలో ఉన్న జంతువులు మా దగ్గర వచ్చి చేరాయి. మరెన్నో గాయాల పాలై, ప్రాణాపాయంలో ఉన్న జీవులు ఇక్కడ కోలుకుని ఆనందంగా ఆడుకుంటున్నాయి. వాటికోసం ఎంతో పరిశోధనలు చేసి వందల సంఖ్యలో నిపుణుల్ని నియమించాం. విభిన్న జాతుల జంతువులు ఇక్కడి అడవిలో చక్కగా తిరుగుతూ ఉండటం చూస్తే ఎవరికైనా ఆనందం కలుగుతుంది'%ొ% అని తన ఈ ముందడుగు గురించి చెబుతాడు అనంత్. ఇంతకీ వంతారా అంటే ఏమిటో చెప్పలేదు కదూ%ొ% స్టార్ ఆఫ్ ద ఫారెస్ట్%ొ% అడవి చుక్క అని అర్థం! వంతారాలో మొత్తం 43 విభిన్న జాతులకు చెందిన 2000 దాకా జంతువులు ఉన్నాయి. అందులో 200 ఏనుగులు ఉన్నాయి. మంచు చిరుతలు, తెల్ల పులులతో పాటు విభిన్న రకాల చిరుతలు, పులులు, సింహాలు ఇక్కడ తిరుగుతుంటాయి. అనేక రకాల పాములు, మొసళ్లు, జిరాఫీలు, జీబ్రాలు, హిప్పోలు%ొ% భారత్ సహా ప్రపంచంలోని విభిన్న ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి చేరాయి. అంతేకాదు, అంతరించిపోతున్న జాతులుగా ఉన్న దేవాంగ పిల్లి, బట్టమేక పిట్ట, రాబందు, ఒకాపి, కారకల్ %ొ% లాంటి జంతు, పక్షుజాతులెన్నో ఇక్కడ తమ ఉనికిని పెంపొందించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. గుజరాత్ రాష్ట్రంలోని జామ్ నగర్‌లో మొత్తం 3000 ఎకరాల్లో ఉన్న దీనిలో ఈ జీవులన్నీ తమ కోసం కేటాయించిన విశాలమైన ప్రాంగణాల్లో సంచరిస్తుంటాయి. అడవుల నరికివేత వల్ల తమ స్థావరాలను కోల్పోవడం, వేట, స్మగ్లింగ్%ొ%లాంటి రకరకాల ప్రమాదాలకు గురయిన జంతువులే ఇవన్నీ. వేరువేరు ఆరోగ్య సమస్యలతో వచ్చే వాటిని ఇక్కడి నిపుణులైన వైద్యులు పరిశీలిస్తారు. ప్రపంచంలోనే అగ్రశ్రేణి వైద్యులు, జంతు సంరక్షణ నిపుణులతో పాటు న్యూట్రీషనిస్టులు, పాథాలజిస్టుల్లాంటి 500 మంది అంకిత భావం కలిగిన నిపుణుల బృందం వీటి జబ్బులు, గాయాలను నయం చేసేందుకు పనిచేస్తున్నది. క్రూర జంతువులా, సాధు జంతువులా, సరీసృపాలా అన్నదాన్ని బట్టి అన్ని జంతువులకూ స్వేచ్ఛగా సంచరించేందుకు సరిపడా స్థలాన్ని కేటాయిస్తారు. వీటి బాగోగులు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా చూసుకునేందుకు 2100 మంది దాకా ఉద్యోగులు ఉన్నారు. 75 యానిమల్ అంబులెన్సులు కూడా ఉన్నాయిక్కడ.















# విరాట్ కోహ్లీ వద్ద శిక్షణ తీసుకున్నా

## సంజయ్ బంగర్ కుమార్తె

భారత మాజీ క్రికెటర్ సంజయ్ బంగర్ కుమార్తె అనయ బంగర్విరాట్ కోహ్లీతో ఉన్న ఫ్రెండ్షిప్ గురించి గుర్తు చేసుకున్నారు. తన తండ్రితో కలిసి కోహ్లీ వద్ద శిక్షణ తీసుకున్నట్లు ఆమె తెలిపారు. అనయ ఒకప్పుడు అబ్బాయే. తన పేరు ఆర్యన్. అయితే తనలో అమ్మాయి లక్షణాలుండడంతో లింగ మార్పిడి చేయించుకుని అనయగా మారింది. తాను క్రికెట్ ఆడే రోజుల్లో సహచర ఆటగాళ్ల నుంచి లైంగిక వేధింపులు ఎదుర్కొన్నట్లు ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలిచింది. 'నేను కోహ్లీని చాలాసార్లు కలిశా. మా నాన్నతోపాటు వెళ్లి అతని వద్ద శిక్షణ పొందాను. నేను బ్యాటింగ్ చేయడం చూశాడు. విరాట్ నాకు కొన్ని టిప్స్ చెప్పాడు. అతని బ్యాటింగ్ను దగ్గర నుంచి చూసే అవకాశం నాకు లభించింది. తీవ్రమైన ఒత్తిడిని ఎలా హ్యాండిల్ చేస్తావని ఒకసారి అడిగాను. తన బలాలను పూర్తిగా అర్థం చేసుకుని, వాటిపై నమ్మకం ఉంచుతూ సాధన చేస్తానని చెప్పాడు. మైదానంలో తాను ఏం చేయగలననే దానిపై కోహ్లీ స్పష్టతతో ఉంటాడు. మనం ఎలా ఆడుతున్నామనే విషయం మనకు తెలిస్తే తర్వాత మిగతావన్నీ చక్కబడతాయి' అని అనయ వివరించారు. కాగా.. తన బ్యాటింగ్ ప్రాక్టీస్కు సంబంధించిన వీడియోను అనయ తాజాగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీనికి నెటిజన్ల నుంచి మంచి స్పందన వచ్చింది.

**క్రికెటర్ అవుదామనుకున్నా.. కానీ**

తండ్రి సంజయ్ బంగర్ మాదిరిగా అనయ కూడా క్రికెటర్ కావాలని భావించారు. అనయగా మారకముందు దేశవాళీలో ఆడిన అనుభవం ఉంది. అయితే, ఆ తర్వాత ఐసీసీ తీసుకున్న నిర్ణయంతో ఆటకు దూరం కావాల్సిన పరిస్థితి ఎదురైంది. 2023 నవంబర్లో మహిళల క్రికెట్లోకి ట్రాన్స్జెండర్లకు అవకాశం లేదని ఐసీసీ నిబంధనలను తీసుకొచ్చింది. ఈ విషయంపై అనయ ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. సంజయ్ బంగర్, కోహ్లీ మధ్య మంచి అనుబంధం ఉన్న సంగతి తెలిసిందే. సంజయ్ టీమ్ఇండియాకు, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు బ్యాటింగ్ కోచ్గా వ్యవహరించాడు. గతంలో కోహ్లీ ఫామ్ లేమితో ఇబ్బందిపడినప్పుడు బంగర్ సలహాలు విరాట్కు ఉపయోగపడ్డాయి.



# ఐపీఎల్ జట్లకు ఊరట.. నిర్ణయం మార్చుకున్న దక్షిణాఫ్రికా

భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తత కారణంగా ఐపీఎల్ వారం పాటు వాయిదా పడిన విషయం తెలిసిందే. మ్యాచ్లు తిరిగి మే 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఐపీఎల్ ఫ్రాంచైజీలకు దక్షిణాఫ్రికా ఓ శుభవార్త చెప్పి ఊరట కల్పించింది. మొదట దక్షిణాఫ్రికా క్రికెట్ బోర్డు తమ ఆటగాళ్లు ముందు చేసుకున్న ఒప్పందం ప్రకారం ఐపీఎల్కు మే 26 వరకు మాత్రమే అందుబాటులో ఉంటారని ప్రకటించింది. జూన్లో తాము ఆస్ట్రేలియాతో డబ్ల్యూటీసీ ఫైనల్ ఆడాల్సి ఉన్న నేపథ్యంలో తమ ప్రథమ ప్రాధాన్యం ఐపీఎల్ కాదని చెప్పింది. కానీ అంతలోనే యూటర్న్ తీసుకొని తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ఈనేపథ్యంలో దక్షిణాఫ్రికా ఆటగాళ్లు ఐపీఎల్కు అందుబాటులో ఉండనున్నారు. డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం సౌతాఫ్రికా తన సన్నాహక సమయాన్ని తగ్గించుకుంది. షెడ్యూల్ ప్రకారం దక్షిణాఫ్రికా, జింబాబ్వేతో జూన్ 3న వార్మప్ మ్యాచ్ ఆడాల్సిఉంది. కానీ తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఈ మ్యాచ్ రద్దయ్యే అవకాశం ఉంది. 'మా షెడ్యూల్లో ఓ సవరణ చోటుచేసుకుంది. జూన్ 3 నుంచి మేం డబ్ల్యూటీసీ ఫైనల్ మ్యాచ్ కోసం మా సన్నాహకాలను ప్రారంభించబోతున్నాం' అని క్రికెట్ సౌతాఫ్రికా డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఎనోచ్ న్క్వే మీడియాతో తెలిపారు. ఈ కారణంగా.. కగిసో రబాడ (గుజరాత్ టైటాన్స్), లుంగి ఎంగిడి (రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు), ట్రిస్టన్ స్టబ్స్ (దిల్లీ క్యాపిటల్స్), ఐడెన్ మార్క్రమ్ (లఖ్నవూ సూపర్ జెయింట్స్), ర్యాన్ రికెల్టన్, కార్బిన్ బాష్ (ముంబయి ఇండియన్స్), మార్కో ఎన్సన్ (పంజాబ్ కింగ్స్), వియాన్ ముల్డర్ (సన్రైజర్స్ హైదరాబాద్) తమ తమ ఐపీఎల్ జట్లకు మ్యాచ్లు పూర్తయ్యేంతవరకు అందుబాటులో ఉండనున్నారు.

### ఆసక్తి రేపుతున్న ఢిల్లీ క్యాపిటల్స్

# మాజీ ఆటగాడి పోస్ట్



ఐపీఎల్ ఫ్రాంచైజీలు తాత్కాలిక రీప్లేస్మెంట్ల కోసం వెతుకుతున్న వేల, టీమిండియా ఆటగాడు, ఢిల్లీ క్యాపిటల్స్ మాజీ ఓపెనర్ పృథ్వీ షా పెట్టిన ఓ పోస్ట్ ఆసక్తి రేపుతోంది. ఈ సీజన్ మెగా వేలంలో అమ్ముడుపోని షా.. "బ్రేక్ కావాలంటూ" ఓ పోస్ట్ పెట్టాడు. ఈ పోస్ట్ చూసిన అభిమానులు షా రీప్లేస్మెంట్ ఆటగాడిగా వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నాడని కామెంట్లు చేస్తున్నారు. 2018లో అరంగేట్రం చేసిన 25 ఏళ్ల షా.. ఐపీఎల్లో డీసెంట్ రికార్డు (79 మ్యాచ్ల్లో 147.467 స్ట్రయిక్రేట్తో 1892 పరుగులు) కలిగి ఉన్నాడు. అయితే వ్యక్తిగత అలవాట్లు, ఫిట్నెస్ కోల్పోవడం అతన్ని ఐపీఎల్ పాటు దేశవాలీ క్రికెట్కు దూరం చేశాయి. గత సీజన్లో ఢిల్లీకి ఆడిన షా.. 8 మ్యాచ్ల్లో 163.63 స్ట్రయిక్రేట్తో 198 పరుగులు చేశాడు. ప్రస్తుత సీజన్లో ఢిల్లీ జేక్ ఫ్రేజర్ మెక్గుర్క్ సేవలు కోల్పోవడంతో షా ఆ జట్టులో చోటు ఆశిస్తున్నాడు. ప్రస్తుత తరుణంలో షాకు ఢిల్లీ అవకాశం ఇవ్వకపోయినా ముంబై ఇండియన్స్ ఛాన్స్ ఇవ్వొచ్చన్న టాక్ నడుస్తుంది. ముంబై ఇండి యన్స్ యాజమాన్యం ఇంగ్లండ్ ఆటగాడు విల్ జాక్స్ స్థానాన్ని భర్తీ చేసేందుకు దేశీయ బ్యాటర్ కోసం? చూస్తుందని సమచారం. ఒకప్పుడు టీమిండియా భవిష్యత్తుగా కీర్తించబడ్డ పృథ్వీ షా ఇప్పుడు ఐపీఎల్లో ఛాన్స్ కోసం వెంపర్లాడటం ఆసక్తికరంగా మారింది. క్రమశిక్షణ లేకపోతే ఎంత టాలెంట్ ఉన్నా ఇలాంటి గతే పడుతుందని జనాలు అంటున్నారు. పృథ్వీ షాలా కావొద్దని ఇప్పుడిప్పుడే షైన్ అవుతున్న యువ ఆటగాళ్లకు సూచిస్తున్నారు.




## డబ్ల్యూటీసీ ప్రైజ్మనీని భారీగా పెంచిన ఐసీసీ.. విజేతకు రూ.ఎన్ని కోట్లంటే?

టెస్టు క్రికెట్ను మరింత ప్రోత్సాహించేందుకు ఐసీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ ప్రైజ్మనీని భారీగా పెంచింది. 2023-25 డబ్ల్యూటీసీ ప్రైజ్మనీని (5.76 మిలియన్ డాలర్లు) రూ.49.27 కోట్లుగా నిర్ణయించింది. ఈ మొత్తాన్ని ఈ డబ్ల్యూటీసీలో పాల్గొన్న తొమ్మిది జట్లకు పంచనున్నారు. గత రెండు ఎడిషన్లలో ప్రైజ్మనీ 3.8 మిలియన్ డాలర్లు మాత్రమే. ఈ ఎడిషన్ ఫైనల్లో ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా తలపడుతున్నాయి. జూన్ 11న లార్డ్స్ వేదికగా ఈ మ్యాచ్ ప్రారంభంకానుంది. ఇందులో విజేతగా నిలిచిన జట్టుకు రూ.30.78 కోట్లు, రన్నరప్ నిలిచిన టీమ్కు రూ.18.46 కోట్లు ఇవ్వనున్నట్లు ఐసీసీ తెలిపింది. ఇక పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో టీమ్ఇండియాకు రూ.12.31 కోట్లు దక్కనున్నాయి. నాలుగో స్థానంలో ఉన్న న్యూజిలాండ్కు రూ.10.26 కోట్లు, ఐదో ప్లేస్లో నిలిచిన ఇంగ్లాండ్కు రూ.8.2 కోట్లు, ఆరో స్థానంలో ఉన్న శ్రీలంకకు రూ.7.18 కోట్లు, తర్వాతి స్థానాల్లో నిలిచిన బంగ్లాదేశ్కు (రూ.6.15 కోట్లు), వెస్టిండీస్కు (రూ.5.13 కోట్లు), పాకిస్థాన్కు (రూ.4.10 కోట్లు) అందనున్నాయి. ఐపీఎల్ 2025 సీజన్ జూన్ 3న ముగియనుంది. తర్వాత ఐదు టెస్టుల సిరీస్ కోసం టీమ్ఇండియా ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది.

# ముంబై ఇండియన్స్లోకి శ్రీలంక కెప్టెన్..!



ఐపీఎల్-2025 రీ షెడ్యూల్ కారణంగా దారుణంగా నష్టపోతున్న ఫ్రాంచైజీలలో ముంబై ఇండియన్స్ ఒకటి. భారత్-పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తల కారణంగా అర్ధరంతరంగా ఆగిపోయిన ఈ ఏడాది ఐపీఎల్ సీజన్.. తిరిగి మే 17 నుంచి ప్రారంభం కానుంది. అయితే చాలా మంది విదేశీ ఆటగాళ్లు జాతీయ విధుల కారణంగా ఐపీఎల్లో మిగిలిన మ్యాచ్లకు దూరం కానున్నారు. ఈ క్రమంలో ముంబై ఇండియన్స్ జట్టు స్టార్ ప్లేయర్లు ర్యాన్ రికెల్టన్, కార్బిన్ బాష్, విల్ జాక్స్ సేవలను కోల్పోయే అవకాశముంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్షిప్ ఫైనల్కు ఎంపిక చేసిన దక్షిణాఫ్రికా జట్టులో బాష్, రికెల్టన్ భాగంగా ఉన్నారు. బాష్, రికెల్టన్ ఒకవేళ ఐపీఎల్లో పాల్గొనేందుకు తిరిగి భారత్కు వచ్చినా, ప్లే ఆఫ్స్కు మాత్రం కచ్చితంగా దూరంగా ఉండనున్నారు. దక్షిణాఫ్రికా క్రికెట్తో బీసీసీఐ సంప్రదింపులు జరిపినప్పటికి.. సదరు క్రికెట్ బోర్డు తమ ఆటగాళ్లు లీగ్ పూర్తి అయ్యేంతవరకు ఉండేందుకు అనుమతి ఇవ్వలేదు. మరోవైపు వెస్టిండీస్తో త్వరలో జరగబోయే టీ20, వన్డే సిరీస్లకు ఎంపిక చేసిన ఇంగ్లండ్ జట్టులో జాక్స్ సభ్యునిగా ఉన్నాడు. అతడు కూడా భారత్కు తిరిగి వచ్చినా ప్లే ఆఫ్స్కు మాత్రం దూరంగా ఉండనున్నాడు.

**ముంబై జట్టులోకి శ్రీలంక కెప్టెన్..?**

ఈ క్రమంలో ముంబై ఇండియన్స్ యాజమాన్యం శ్రీలంక కెప్టెన్ చరిత్ అసలంకపై కన్నేసినట్లు తెలుస్తోంది. తమ జట్టులోకి తీసుకునేందుకు చరిత్ అసలంకాతో ముంబై చర్చలు జరుపుతున్నట్లు శ్రీలంక వార్తా సంస్థ న్యూస్ వైర్ తమ కథనంలో పేర్కొంది. అసలంకకు టీ20ల్లో అద్భుతమైన రికార్డు ఉంది. అతడికి బ్యాట్తో పాటు బంతితో కూడా రాణించే సత్తా ఉంది. అంతర్జాతీయ టీ20ల్లో చరిత్కు 5 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అతడితో ఒప్పందం కుదర్చుకునేందుకు ముంబై ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కాగా ఐపీఎల్ రీ షెడ్యూల్ కారణంగా ఈ సీజన్లో ఆటగాళ్ల తాత్కాలిక ప్రత్యామ్నాయాలకు బీసీసీఐ అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. ముంబై ఇండియన్స్కు ఈ ఏడాది సీజన్లో ఇంకా రెండు మ్యాచ్లు మిగిలి ఉన్నాయి. ఈ రెండు మ్యాచ్ల్లో హార్దిక్ సేన గెలిస్తే నేరుగా ప్లే ఆఫ్స్కు అర్హత సాధిస్తోంది.


GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

## వీరయ్య చౌదరి హంతకులకు కఠిన శిక్ష

### కుటుంబ సభ్యులను పరామర్శించిన లోకేశ్



**ఒంగోలు,, (క్రైమ్ మిర్రర్):** ఇటీవల ఒంగోలులో దారుణ హత్యకు గురైన తెదేపా నేత, మాజీ ఎంపీపీ వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. యువగళం పాదయాత్ర సమయంలో తనతో పాటు-అడుగులు వేశారని, పార్టీ పటిష్ఠత కోసం కృషిచేసిన వీరయ్య చౌదరి దారుణహత్య బాధాకరమని అన్నారు. హత్య నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు. వీరయ్య చౌదరి కుటుంబానికి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలులోని మాజీ ఎంపీపీ నివాసానికి మంత్రి వెళ్లారు. వీరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వీరయ్య చౌదరి సతీమణి, కుమారుడు, ఇతర కుటు-ంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మాజీ ఎంపీపీతో తనకున్న అనుబంధాన్ని ఈ సందర్భంగా లోకేశ్ గుర్తు చేసుకున్నారు. యువగళం పాదయాత్ర సమయంలో వీరయ్య చౌదరి తనతో పాటు- అడుగులు వేశారని లోకేశ్ తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషిచేసిన ఆయన దారుణహత్యకు గురవడం బాధాకరమని తెలిపారు. హత్య కేసు నిందితులకు కఠినంగా శిక్ష పడేలా చేస్తామని అన్నారు. వీరయ్య చౌదరి కుటు-ంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటు-ందని భరోసా ఇచ్చారు. కుటు-ంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. లోకేశ్ వెంట మంత్రులు డోలా బాల వీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్ర నరసింహా రెడ్డి, బీఎన్ విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు ఉన్నారు

## కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు

### ముందు వెళ్లి క్షమాపణలు చెప్పండి

### మధ్యప్రదేశ్ మంత్రికి సుప్రీం ఆదేశాలు

**న్యూఢిల్లీ,, (క్రైమ్ మిర్రర్):** సైనికాధికారి కర్నల్ సోఫియా ఖురేషీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ముందుగా క్షమాపణలు చెప్పాలని మధ్యప్రదేశ్ మంత్రిని సుప్రీం ఆదేశించింది.ముందు వెళ్లి హైకోర్టులో క్షమాపణలు చెప్పండి. ఇలాంటి అంశాల్లో కాస్త సున్నితంగా వ్యవహరించండని ఆగ్రహం వ్యక్తంచేసింది. పాకిస్థాన్‌తో పోరుకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడిస్తూ వచ్చిన సైనికాధికారి కర్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. హైకోర్టు ఆదేశాల మేరకు ఆయనపై కేసు కూడా నమోదైంది. ప్రస్తుతం ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. హైకోర్టు ఆదేశాలపై ఆయన అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. మంత్రి పిటిషన్‌ను శుక్రవారం విచారించేందుకు కోర్టు అంగీకరించింది. అంతేగాకుండా ఆయన తీరును తప్పుపట్టింది. ఎలాంటి మాటలు మాట్లాడుతున్నారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి మీడియాకు వివరాలను వెల్లడించిన కర్నల్ ఖురేషీని ఉద్దేశిస్తూ ఆమెను 'ఉగ్రవాదుల సోదరి' అని విజయ్ షా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఇదికాస్త తీవ్ర దుమారం రేగడంతో మంత్రి వ్యాఖ్యలను హైకోర్టు బుధవారం సుమోటోగా తీసుకుంది. శత్రుత్వం, విద్వేషాన్ని ప్రోత్సహించినందుకు ఆయనపై ఎఫ్ఐఆర్‌ను నమోదు చేయాలని జస్టిస్ అతుల్ శ్రీధరణ్, జస్టిస్ అనురాధా శుక్లాలతో కూడిన ధర్మాసనం పోలీసులను ఆదేశించింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసి తమకు నివేదించాలని రాష్ట్ర డీజీపీని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ... దేశంలో ఇంకా సమగ్రత, క్రమశిక్షణ, త్యాగం, నిస్వార్థం, గౌరవం, అజేయమైన ధైర్యం నిండి ఉన్న సంస్థ ఒక్క సైన్యం మాత్రమేనని పేర్కొన్నారు. అటు జాతీయ మహిళా కమిషన్ కూడా మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించింది. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న మహిళలపై ఇటు-వంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని పేర్కొంది. మంత్రి చేసిన వ్యాఖ్యలపై భాజపా సీనియర్ నాయకుడు ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ స్పందించారు. విజయ్ షాను 'మూర్ఖుడు' అని ఆయన సంబోధించారు. మరోవైపు విజయ్ షాపై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రధాని మోదీని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది.

## కాశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత

### ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ముష్కరుల హతం

**శ్రీనగర్, (క్రైమ్ మిర్రర్):** జమ్మూకశ్మీర్ అవంతిపొరాలో ఎన్‌కౌంటర్ జరిగింది. నాదర్, ట్రాల్ ప్రాంతాల్లో భద్రతాబలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎన్‌కౌంటర్ కొనసాగింది. అటవీప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారన్న సమాచారంతో భద్రతాబలగాలు రంగంలోకి దిగాయి. ఈ నేపథ్యంలోగురువారం ఉదయం భద్రతాబలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో జైషే మహ్మద్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా దళాలు హతం చేశాయి. కాగా జమ్మూకశ్మీర్‌లో గడిచిన 48 గంటల్లో ఇది రెండో ఎన్‌కౌంటర్. జమ్మూకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో ఉగ్రవాదులు దాగి ఉన్నారన్న అనుమానంతో భద్రతాబలగాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. అటవీప్రాంతాల్లో అణువణువు జల్లెడపడుతున్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. పహల్గాం నిందితులు, ఉగ్రవాదులను భద్రతాబలగాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆ వేటలో భాగంగానే ఎన్‌కౌంటర్లు జరుగు తున్నాయి. కొన్ని కొత్త ప్రదేశాల్లో ఉగ్రవాదులు దాగి ఉన్నట్లు- గుర్తించిన భద్రతా బలగాలు వారి కోసం గాలింపు చర్యలు చేపట్టాయి. పాకిస్థాన్ నుంచి వచ్చిన చొరబాటు-ఉగ్రవాదులను మట్టుబెడుతున్నాయి. గురువారం ఉదయం టెర్రరిస్టుల కోసం గాలించగా నాదర్ , ట్రాల్ ప్రాంతాల్లో తారసపడ్డారు. భద్రతా బలగాలను చూసిన వెంటనే ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. వెంటనే భద్రతాబలగాలు కూడా ప్రతిగా కాల్పులు జరుపుతున్నాయి. అయితే ఈ కాల్పుల్లో ఓ ఉగ్రవాది మరణించినట్లు- సమాచారం. మరో ముగ్గురు నలుగురు ఉగ్రవాదులు ఉండవచ్చనే అనుమానాలు ఉన్నాయి. అవంతిపొరాలో ఎదురుకాల్పులపై కేంద్ర హోంశాఖ, రక్షణ శాఖ ఆరా తీసింది. రెండు రోజుల క్రితం కూడా షోపియాన్ ప్రాంతంలో జిన్‌పాథర్ కెల్లర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఆపరేషన్ కెల్లార్ పేరుతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఉగ్రవాదులు హతమవడంతో పాటు- భారీగా ఆయుధాలను స్వాధీనం చేస్తున్నారు. అంతేకాకుండా మందుగుండు సామాగ్రిని కూడా భద్రతాబలగాలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తానికి పహల్గాం దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులను పట్టు-కోవాలనే సంకల్పంతో భద్రతాబలగాలు ముందుకు సాగుతున్నాయి.

# పాక్ అణ్వాయుధాల గుట్టు తేల్చాలి

### వాటి రక్షణపై అనుమానాలు ఉన్నాయి.. అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీస్వాధీనం చేసుకోవాలి

### పాక్ కుట్రలను తిప్పికొట్టిన భారత దళాలకు సెల్యూట్.. కాశ్మీర్ పర్యటనలో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

(మొదటి పేజీ తరువాయి)

**న్యూఢిల్లీ,, (క్రైమ్ మిర్రర్):** బాధ్యతలేని, దుష్ట పాకిస్థాన్ వద్ద అణ్వాయుధాలు ఉండడం ఎంత వరకు క్షేమం అని ప్రపంచ దేశాల్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్నించారు. కాశ్మీర్‌లో పర్యటించిన సందర్భంగా శ్రీనగర్‌లోని బాదామి బాగ్ కంటోన్మెంట్‌లో గురువారం ఆయన మాట్లాడారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్ వద్ద న్యూక్లియర్ ఆయుధాలు ఉండడం ఎంత వరకు సమంజసం అని రాజ్‌నాథ్ అడిగారు. అంతర్జాతీయ అణు ఇంధన ఏజెన్సీ .. పాకిస్థాన్ అణ్వాయుధాలను తన ఆధీనంలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో జరిగిన దాడిలో.. కిరానా హిల్స్ సమీపంలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్‌ను భారతీయ వైమానిక దళాలు దాడి చేశాయి. అయితే ఆ ఎయిర్‌బేస్ వద్ద న్యూక్లియర్ వార్‌హెడ్స్‌ను పాకిస్థాన్ దాచిపెట్టినట్లు తెలుస్తోంది. దాడి జరగడం వల్ల ఆ న్యూక్లియర్ వార్‌హెడ్స్ నుంచి అణుధార్మికత రిలీజ్ అవుతున్నట్లు-ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో శ్రీనగర్ పర్యటనలో రక్షణ మంత్రి తన ప్రసంగంలో ఆ అంశాన్ని ప్రస్తావించారు. పెహల్గామ్ దాడి తర్వాత జమ్మూకశ్మీర్ ప్రజల్లో పాకిస్థాన్, ఉగ్రవాదులపై ఆగ్రహం వ్యక్తం అయ్యిందని, జమ్మూకశ్మీర్ ప్రజలకు సెల్యూట్ చేస్తున్నానని, శుత్రవులను నాశనం చేసిన శక్తి ఇక్కడ



ఉందని, పాకిస్థానీ చౌకీలు, బంకర్లను ధ్వంసం చేసిన తీరుతో శత్రుదేశం షాక్‌కు గురైందన్నారు. కిష్టమైన పరిస్థితుల్లో ఇక్కడ మీతో ఉండడం గర్వంగా భావిస్తున్నానని, ఆపరేషన్ సింధూర్ సమయంలో మీరు చేసిన పని పట్ల దేశం గర్వంగా ఉందన్నారు. రక్షణ మంత్రి కన్నా ముందు తాను దేశ పౌరుడినని, ఓ మంత్రిగానే కాకుండా, ఓ పౌరుడిగా ధన్యవాదాలు చెబుతున్నట్లు రాజ్‌నాథ్ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో పర్యటిస్తున్న రాజ్‌నాథ్‌కు ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది స్వాగతం పలికారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడుతూ.. ఉగ్ర శిబిరాలు ఎక్కడ ఉన్నా నాశనం చేస్తామని చెప్పారు. -టె- టెర్రరిస్టులతో పోరాడి ప్రాణత్యాగాలు చేసిన జవాన్లకు శిరస్సు వంచి నివాళులర్పిస్తున్నట్లు- పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ అనేది కేవలం ఒక పేరు మాత్రమే కాదని.. అదొక కమిట్‌మెంట్ అని పేర్కొన్నారు. భారత్‌పై ఉగ్రదాడి జరిగితే.. దానిని యుద్ధ చర్యగానే పరిగణిస్తామన్నారు. మన దళాలు అద్భుతంగా పోరాడుతున్నాయని పేర్కొన్నారు. ఇంతటి ప్రతికూల పరిస్థితుల్లో కూడా వారి మధ్య ఉన్నందుకు గర్వంగా ఉందని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడి మృతులకు ఆయన నివాళులర్పించారు. ఇక ఈ పర్యటనలో భాగంగా పాకిస్థాన్ షెల్లింగ్‌లో దెబ్బతిన్న ప్రాంతాలను ఆయన సందర్శించారు. ఇక మన దళాల సంసిద్ధతను ఆయన పర్యవేక్షించనున్నారు. దీనిలోభాగంగా చినార్ కోర్ ప్రధాన కార్యాలయాన్ని ఆయన సందర్శించి.. ఆర్మీ, వాయుసేన సిబ్బందితో మాట్లాడనున్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణ మంత్రి జమ్మూకశ్మీర్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. అంతకుముందు ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది కూడా జమ్మూకశ్మీర్‌లోనే పర్యటించారు. ఆయన నేడు చినార్‌కోర్‌లోని డాగర్స్ డివిజన్‌లోని అన్ని ర్యాంకుల అధికారులతో సమావేశమయ్యారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సరిహద్దుల వద్ద నిర్భయంగా, అప్రమత్తంగా ఉన్నారని అభినందించారు.

## కాటన్ ముందుచూపు మరువలేనిది: బాబు

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** సాగునీటి ప్రాజెక్టులు, కాలువలు నిర్మించి, స్థిరమైన వ్యవసాయ అభివృద్ధికి సర్ ఆర్థర్ కాటన్ చేసిన కృషిని ఎవరూ మర్చిపోలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. సర్‌ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా మహానుభావుని స్మృతికి నివాళు లర్పిస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. ఒక వ్యక్తి తలుచుకుంటే ఎన్ని అద్భుతాలు చేయవచ్చో కాటన్ మహాశయుడు రుజువు చేశారని ప్రశంసించారు. రాజమహేంద్రవరంలో 1852లో గోదావరి నదిపై ధవలేశ్వరం బ్రిడ్జిని ఇంజినీర్ సర్ అర్థర్ కాటన్ నిర్మించారు.

## అణగారిన వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత

- ఆ భయంతోనే కులగణనకు మోడీ అంగీకారం
- బీహార్పర్యటనలో రాహుల్ విమర్శలు




**పాట్నా,(క్రైమ్ మిర్రర్):** దేశంలో అణగారిన వర్గాల నుంచి వ్యతిరేకత ఎదురవుతుందనే భయంతోనే ప్రధాని మోదీ కులగణనకు అంగీకరించారని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. వెనుకబడిన వర్గాల తరఫున పోరాడుతున్న ప్రతిపక్షానికి ప్రధాని భయపడ్డారని అన్నారు. బిహార్‌లోని దర్భంగాలో నిర్వహించిన సమావేశంలో మిథిలా యూనివర్సిటీ- విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేవలం 5శాతం మంది ప్రజల ప్రయోజనాల కోసమే మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దళితులు, ఓబీసీలు, ఆదివాసీలకు ఈ ప్రభుత్వంలో స్థానం లేదని, కార్పొరేట్ వ్యక్తులకే మోదీ గవర్నమెంట్ వత్తాసు పలుకుతోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో చేపట్టిన విధంగా దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని, ప్రైవేటు- కళాశాలలు, యూనివర్సిటీల్లో రిజర్వేషన్లు కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం కేటాయించిన నిధులను విడుదల చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం మెడలు వంచైనా వీటిని సాకారం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.తాను ఇక్కడికి రాకుండా అడ్డుకునేందుకు స్థానిక నేతలు, అధికారులు ఎంతో ప్రయత్నించారని అన్నారు. అన్ని అడ్డంకుల్నీ అధిగమించి వచ్చానని చెప్పారు. ఈ ఏడాది చివర్లో బిహార్ శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే ఎన్నికల వ్యూహాలను అమలు చేస్తోంది. అందులో భాగంగానే బిహార్‌లో యువతతో మమేకమయ్యేందుకు తలపెట్టిన 'శిక్షా న్యాయ్ సంవాద్' కార్యక్రమాన్ని రాహుల్ గాంధీ ప్రారంభించారు.

## పాక్ అదుపులో 21 రోజులపాటు నరకం

### కళ్లకు గంతలు కట్టి మాటలతో హింస



పాక్ రేంజర్ల నిర్బంధంలో గత 21 రోజులుగా ఉన్న సరిహద్దు భద్రతా దళం బీఎస్ఎఫ్ జవాన్ పూర్ణమ్ కుమార్ షా విడుదలైన సంగతి తెలిసిందే. పాక్ అదుపులో ఉన్నప్పుడు ఆయనను నిద్ర పోనివ్వలేదని, దూషించారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. నిర్బంధంలో ఉన్నన్ని రోజులు పాక్ అధికారులు పూర్ణమ్‌ను మూడు ప్రాంతాల్లో తిప్పి ఒక లొకేషన్‌లో జైలు సెల్‌లో ఉంచారు. వారివద్ద ఉన్నన్ని రోజులు చాలావరకు కళ్లకు గంతలు కట్టే ఉంచారని సమాచారం. ఆయనను శారీరకంగా హింసకు గురిచేయలేదు కానీ.. మాటలతో మాత్రం వేధింపులకు గురిచేశారని ఆ వర్గాలు వెల్లడించాయి. కనీసం నిద్ర పోనివ్వలేదని, బ్రష్ చేసుకోవ్వలేదని తెలిపాయి. అలాగే సరిహద్దులో మోహరింపు గురించి, అక్కడ ఉండే సీనియర్ అధికారుల గురించి వివరాలు రాబట్టేందుకు ప్రయత్నించారని పేర్కొన్నాయి. కాంటాక్ట్ వివరాలు ఇవ్వాలని ఆ అధికారులు ఒత్తిడి చేశారని తెలుస్తోంది. అయితే బీఎస్ఎఫ్ నిబంధనల ప్రకారం ఆయన వద్ద ఎలాంటి ఫోన్ లేకపోవడంతో వారికి వివరాలు అందలేదు. ఇక ఈ ప్రశ్నలన్నీ అడిగిన అధికారులు సివిల్ దుస్తుల్లో ఉన్నారని సమాచారం. పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ సెక్టార్‌లో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి రైతులకు రక్షణగా గత నెల 23న గస్తీ నిర్వహిస్తున్న సమయంలో పూర్ణమ్ అస్వస్థతకు గురయ్యారు. సమీపంలో ఓ చెట్టు- కనబడటంతో దానికింద విశ్రాంతి తీసుకున్నారు. అది పాక్ భూభాగం అన్న విషయాన్ని గుర్తించలేకపోయారు. పాకిస్థాన్ రేంజర్స్ ఆయనను నిర్బంధంలోకి తీసుకున్నారు. జవాన్ విడుదల కోసం రెండు దేశాల భద్రతా దళాలు ఆరు సార్లు చర్చలు జరిపాయి. మరోవైపు పూర్ణమ్ కుటుంబసభ్యులు తీవ్రంగా ఆందోళన చెందారు. గర్భిణి అయిన ఆయన భార్య.. భర్త విడుదల కోసం కేంద్రాన్ని వేడుకున్నారు. కొన్నాళ్లపాటు-భారత్ అధికారుల అభ్యర్థనలు పట్టించుకోకుండా పాక్ రేంజర్లు కాలయాపన చేశారు. అయితే ఈనెల మొదటివారంలో రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్ సమీపంలో మన భూభాగంలోకి ప్రవేశించిన పాక్ రేంజర్ మహమ్మదుల్లాను బీఎస్ఎఫ్ అదుపులోకి తీసుకుంది.

# అహల్యా భాయి హోల్కర్ త్రిశత జయంతి వేడుకలు

### ఆమె ముందుచూపుతో అనేక సంస్కరణలు చేపట్టారు

### నివాళి అర్పించిన దగ్గుబాటి పురంధేశ్వరి

**విజయవాడ,(క్రైమ్ మిర్రర్):** ఆర్థిక శక్తిగా భారతదేశాన్ని తీసుకెళ్లాలంటే మౌలిక సదుపాయాలు సమకూర్చుకోవాలని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. అలాంటి ఆలోచనలు ఆనాడు అహల్య భాయి హోల్కర్ ఆలోచించి వాటిని అందుబాటులోకి తీసుకువచ్చేలా కృషి చేశారని చెప్పారు. పరిశ్రమలకు పెట్టుబడులు రావాలంటే ఇలాంటి మౌలిక సదుపాయాలు ఎంత అవసరమో గమనించి వాటిపై ఆనాడే దృష్టి పెట్టారని అన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అహల్యా భాయి హోల్కర్ త్రిశత జయంతి వేడుకల ఏర్పాటు-కు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు మీనాక్షి లేఖీ, బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ ..మహిళల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం అహల్య భాయి హోల్కర్ చట్టసవరణలు చేశారని గుర్తుచేశారు. భర్తలు చనిపోయిన మహిళలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో భర్త ఆస్తిలో.. ఆ భార్యకు హక్కు ఉంటుందని చట్టసవరణ చేసి మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. దళితులకు భూములు కేటాయించటం వారికీ సంక్షేమం అందించటంలో అహల్య భాయి ప్రముఖ పాత్ర పోషించారని అన్నారు. 1795వ సంవత్సరం ముందే ఇవన్నీ చేశారంటే అహల్య భాయికు ఎంత ముందు చూపు ఉందో అర్థమవుతుందని తెలిపారు. చేనేత రంగం వెనుకబడుతున్న పరిస్థితుల్లో మహేశ్వర్ అనే ప్రదేశంలో వారి ఉనికిని కాపాడారని అన్నారు. మహిళల్లో ధైర్యాన్ని అహల్య భాయి నింపారని దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. అహల్య భాయి సేవా కార్యక్రమాల కోసం రాష్ట్ర ఖజానా నుంచి ఎప్పుడు ఒక్క రూపాయి తీసుకోలేదని దగ్గుబాటి పురందేశ్వరి గుర్తుచేశారు. పాశ్చాత్య దేశాలు మన దేశంలోని గుడులు గోపురాలపై దాడులు చేశాయని చెప్పారు. ఆలయాలను పరిరక్షించటానికి గర్భగుడి ఉండాలనే ఆలోచనలతో అహల్య భాయి నిర్మించారని అన్నారు. ఉత్తర భారతదేశం నుంచి దక్షిణ భారతదేశం వరకు ఎన్నో ఆలయాలను అహల్యభాయి నిర్మించారని చెప్పారు. మణికర్ణిక ఘాట్లు- వ్యాపారానికి ఉపయోగపడేలా ఒక ఆలోచనతో పరిపాలన ఉండేదని అన్నారు. ఇలాంటి చాలా గొప్ప నిర్ణయాలు ఆలోచనలతో అహల్య భాయి పాలన ఉండేదని చెప్పారు. ఇలాంటి వ్యక్తుల ఆలోచన ఆదర్శంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని ఉద్ఘాటించారు. 11వ ఆర్థిక శక్తిగా ఉండే భారత్.. మోదీ హయాంలో 4వ ఆర్థిక శక్తిగా ఎదిగిందని గుర్తుచేశారు.

క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

సినిమా

10

శుక్రవారం


16-5-2025




# నార్త్ లో కూడా బాగానే రాబట్టిన 'హిట్ 3'..!

లేటెస్ట్ గా మన తెలుగు సినిమా దగ్గర రిలీజ్ కి వచ్చి సాలిడ్ విజయాన్ని అందుకున్న చిత్రం "హిట్ 3". నాచురల్ స్టార్ నాని హీరోగా శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కించిన ఈ చిత్రం నాని కెరీర్లోనే భారీ గ్రాసర్ గా నిలిచింది. ఇక ఈ సినిమా పాన్ ఇండియా భాషల్లో విడుదల అయితే మేజర్ గా తెలుగులో మాత్రమే అత్యధిక వసూళ్లు నమోదు అయ్యాయి.దమరి అసలు హిందీ వెర్షన్ పరిస్థితి ఏంటి అనేది ఇపుడు తెలుస్తుంది. హిట్ 3 చిత్రానికి బాలీవుడ్ లో మొత్తం 6 రోజుల్లో 5 కోట్ల గ్రాస్ మేర వసూళ్లు నార్త్ బెల్ట్ లో నమోదు అయినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. దీనితో హిందీలో కూడా హిట్ 3 పర్వాలేదు అనే రేంజ్ లోనే పెర్ఫామ్ చేసింది అని చెప్పొచ్చు. ఇక వీక్ డేస్ లోకి వచ్చిన తర్వాత కూడా హిట్ 3 మంచి బుకింగ్స్ ని కనబరుస్తుంది. ఫైనల్ రన్ లో సినిమా ఎక్కడ ఆగుతుందో చూడాలి.

# 'జాక్' ఓటీటీ రిలీజ్ డేట్ పై క్లారిటీ !



సిద్ధూ జొన్నలగడ్డ, వైష్ణవి చైతన్య కలయికలో వచ్చిన చిత్రం 'జాక్'. బొమ్మరిల్లు భాస్కర్ ఈ చిత్రాన్ని రూపొందించారు. వేసవి కానుకగా ఏప్రిల్ 10న ఈ సినిమా థియేటర్లలో విడుదలైంది. అయితే, బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఆడలేదు. కాగా తాజాగా ఈ చిత్రం ఓటీటీ వేదికగా వినోదాన్ని పంచేందుకు రెడీ అయింది. మే 8 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కాబోతుంది. తెలుగుతోపాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో కూడా ఈ సినిమా ప్రేక్షకులకు అందుబాటులోకి రాబోతుంది. కాగా తాజాగా ఈ విషయాన్ని సదరు ఓటీటీ సంస్థ అధికారికంగా తెలియజేసింది. సిద్ధూ జొన్నలగడ్డ జాక్ గా మంచి పెర్ఫార్మన్స్ ని కనబరిచాడు. అలాగే తన రోల్ లో మంచి హ్యాండ్సమ్ గా చాలా కాన్ఫిడెన్స్ గా తన మార్క్ కామెడీ టైమింగ్ తో అలరించాడు. అటు వైష్ణవి కూడా తన రోల్ లో బాగా చేసింది. సిద్ధుకి తనకి నడుమ కొన్ని సీన్స్ మంచి ఫన్ అండ్ ఎంటర్టైన్మెంట్ గా సాగాయి. మరి ఓటీటీలో ఈ సినిమా ఏ రేంజ్ లో హిట్ అవుతుందో చూడాలి.

# చిరు కోసం బాలీవుడ్ భామను పట్టుకొస్తున్న శ్రీకాంత్..?



మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వరుసగా సినిమాలు అనౌన్స్ చేసి వాటిని తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే 'విశ్వంభర' చిత్రాన్ని రిలీజ్‌కు రెడీ చేసిన మెగాస్టారు, తన నెక్స్ట్ చిత్రాన్ని దర్శకుడు అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నాడు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. ఇక ఈ సినిమా తర్వాత మెగాస్టార్ తన నెక్స్ట్ చిత్రాన్ని యంగ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ సినిమాను ఇప్పటికే అఫీషియల్‌గా అనౌన్స్ చేశాడు. ఈ చిత్ర షూటింగ్‌ను కూడా త్వరలో ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే, ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ భామను తీసుకొచ్చేందుకు శ్రీకాంత్ ప్లాన్ చేస్తున్నాడట. తొలుత బాలీవుడ్ హీరోయిన్ రాణి ముఖర్జీని ఈ సినిమాలో హీరోయిన్‌గా తీసుకోవాలని శ్రీకాంత్ ప్లాన్ చేశాడట. అయితే, ఇప్పుడు ఈ సినిమా కోసం దీపిక పదుకొనె పేరు వినిపిస్తోంది. 'కల్కి' మూవీలో నటించిన దీపిక టాలీవుడ్ ప్రేక్షకులకు దగ్గరయ్యింది. మరి చిరంజీవి కోసం దీపిక ఈ సినిమాను ఓకే చేస్తుందా లేదా అనేది వేచి చూడాలి.



# 'పెద్ది'లో కిసుక్కు అనిపించే బ్యూటీ..?

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'పెద్ది'పై ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ అయ్యాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్ చరణ్ పూర్తి రగడ్ లుక్‌లో కనిపిస్తుండటంతో ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమాకు సంబంధించి తాజాగా సినీ సర్కిల్స్‌లో ఓ ఇంట్రెస్టింగ్ వార్త జోరుగా చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో ఓ అదిరిపోయే మాస్ మసాలా సాంగ్ ఉండనుందని తెలుస్తోంది. ఈ స్పెషల్ సాంగ్‌లో 'కిస్సిక్' అంటూ నేషన్‌ను షేక్ చేసిన యంగ్ బ్యూటీ శ్రీలీల డ్యాన్స్ చేయబోతుందనే వార్త జోరుగా చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే పుష్ప-2 మూవీలో అమ్మడి పాటకు యమ క్రేజ్ దక్కింది. దీంతో ఇప్పుడు మరోసారి ఈ బ్యూటీతో బుచ్చిబాబు సాలిడ్ సాంగ్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం చాలా సెలెక్టివ్‌గా సినిమాలను లైనప్ చేస్తున్న ఈ బ్యూటీ, పెద్ది కోసం మరోసారి స్పెషల్ అవతారం ఎత్తుతుందా లేదా అనేది చూడాలి.



# ఆ కష్టాలు ఎలా ఉంటాయో ఇప్పుడు తెలుస్తోంది: సమంత

ప్రముఖ హీరోయిన్ సమంత నటిగా తనదైన ముద్ర వేసిన తర్వాత ఇప్పుడు చిత్ర నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టారు. తన సొంత నిర్మాణ సంస్థ 'ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్' పతాకంపై ఆమె నిర్మించిన తొలి చిత్రం 'శుభం'. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించిన ఈ సినిమా మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమంత, చిత్ర విశేషాలతో పాటు నిర్మాతగా తన తొలి అనుభవాలను, ముఖ్యంగా చిత్ర నిర్మాణంలో ఎదురయ్యే ఆర్థిక, సమయ పరమైన సవాళ్లను పంచుకున్నారు. నటిగా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో భాగమైనప్పటికీ, నిర్మాతగా బాధ్యతలు స్వీకరించడం సరికొత్త అనుభూతినిచ్చిందని సమంత తెలిపారు. అయితే, ఈ ప్రయాణంలో కొన్ని కఠిన వాస్తవాలు కూడా గ్రహించినట్లు ఆమె పేర్కొన్నారు. "నటిగా ఉన్నప్పుడు మన పాత్ర వరకే ఆలోచిస్తాం. కానీ నిర్మాతగా మారిన తర్వాత ప్రతి చిన్న విషయం మనదే అవుతుంది. ముఖ్యంగా, లిలిఒక సన్నివేశం అనుకున్న విధంగా రాకపోతే, లేదా చిత్రీకరణలో అనుకోని అవాంతరాలు ఎదురైతే, ఎంత సమయం వృధా అవుతుందో, ఎంత డబ్బు నష్టపోతామో ఇప్పుడు నాకు పూర్తిగా అర్థమైంది. ప్రతి నిమిషం, ప్రతి రూపాయి విలువైనదే అని నిర్మాత కుర్చీలో కూర్చున్నాకే తెలిసిందిలి" అంటూ నిర్మాత పడే ఆవేదనను ఆమె వివరించారు. గతంలో ఒక సన్నివేశం సరిగ్గా రాలేదని రీషూట్ అంటే నటిగా తేలికగా తీసుకునేదాన్ని ఏమో కానీ, ఇప్పుడు నిర్మాతగా దాని వెనుక ఉన్న ఆర్థిక భారం, సమయపాలన వంటి అంశాలు ఎంత కీలకమో తెలిసివచ్చిందని సమంత అన్నారు. "ఒక షాట్ ఆలస్యమైతే, లొకేషన్ ఖర్చులు, యూనిట్ సభ్యుల వేతనాలు, ఇతర నిర్వహణ వ్యయాలు ఎలా పెరుగుతాయో ప్రత్యక్షంగా చూశాను. ఇది నాకు ఒక పెద్ద పాఠం. సమర్థవంతమైన ప్రణాళిక, కచ్చితమైన అమలు నిర్మాతకు ఎంత అవసరమో గ్రహించాను" అని ఆమె తన అనుభవాలను పంచుకున్నారు.

**కొత్తవారికి ప్రోత్సాహం, కథే ప్రధానం**

గౌతమ్ మీనన్ తనకు తొలి అవకాశం ఇచ్చినట్లే, తాను కూడా కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే నిర్మాణ రంగంలోకి వచ్చానని సమంత తెలిపారు. 'శుభం' చిత్రంలో శ్రియా, శ్రావణి, షాలిని వంటి కొత్త నటీమణులకు అవకాశం కల్పించామని, వారు చాలా కష్టపడి పనిచేశారని ప్రశంసించారు. వసంత్ అందించిన కథ... సీరియల్స్ చుట్టూ తిరిగే ఒక సోషల్ సెటైర్ అని, ఇది ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం తనకుందని అన్నారు. బడ్జెట్ విషయంలో కథకు ఎంత అవసరమో అంతే ఖర్చుపెట్టామని, అనవసర ఆర్భాటాలకు పోలేదని స్పష్టం చేశారు. 'శుభం' చిత్రం మే 9న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో, కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిదని, ప్రేక్షకులు ఆదరించి విజయవంతం చేయాలని సమంత కోరారు. నిర్మాతగా తన తొలి ప్రయత్నంలో నేర్చుకున్న పాఠాలు భవిష్యత్తు ప్రాజెక్టులకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

Printed, Published and Edited by Makam Gangadhar,
H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar,